Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 7 మేడ్చల్ మల్కాజ్‌గిరి 31 జనవరి 2024 బుధవారం పేజీలు : 4

## మోదీ మళ్లీ గెలిస్తే దేశానికి ఇవే చివరి ఎన్నికలు : ఖర్గే

భువనేశ్వర్ : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో మళ్లీ ప్రధాని మోదీ గెలిస్తే దేశానికి ఇవే చివరి ఎలక్షన్లు అవుతాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అభిప్రాయపడ్డారు. బీజేపీ మరోసారి విజయం సాధిస్తే మోదీ నియంతృత్వంవైపే మొగ్గు చూపే అవకాశం ఉందని అన్నారు. రష్యాలో పుతిన్ పాలించినట్టుగా ఇక్కడ కూడా మోదీ ప్రభుత్వం ఉండాలని బీజేపీ కోరుకుంటోందని ఆరోపించారు. అందువల్ల ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి దేశ ప్రజలకు ఉన్న చివరి అవకాశం రానున్న ఎన్నికలేనని హెచ్చరించారు. ఇక్కడ జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రసంగించిన ఆయన ఆర్ఎస్ఎస్–బీజేపీలపై ఘాటు విమర్శలు చేశారు. వాటి సిద్ధాంతాలు విషపూరితమని, అందువల్ల వాటికి దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

# నేటి నుండే లోక్‌సభ బడ్జెట్ సమావేశాలు!




## రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సెషన్ మొదలు

ఢిల్లీ: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు కొత్త భవనంలో రేపటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 11 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగంతో సెషన్ మొదలవుతుంది. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ గురువారం నాడు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను లోక్ సభలో ప్రవేశ పెడతారు. ఏప్రిల్– మే నెలలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రతిపాదిస్తారు.

ఎన్నికల నేపథ్యంలో విధానపర ప్రకటనలు ఏమి ఉండకపోవచ్చు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు పార్లమెంట్ ఆమోదం తెలిపితే ఏప్రిల్– జులైకి కావాల్సిన నిధులను ప్రో రేటా ప్రాతిపదికన భారత సంఘటిత నిధి నుంచి తీసుకునే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుంది. సార్వత్రిక ఎన్నికల తర్వాత కొత్త ప్రభుత్వం 2024–25 ఏడాదికి జూన్‌లో పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశ పెడతారు.

**పెరగనున్న కిసాన్ సన్మాన్ నిధి :** ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని 50 శాతం పెంచే అవకాశం ఉంది. కిసాన్ సన్మాన్ పథకం ద్వారా భూమి ఉన్న రైతులకు ఏడాదికి రూ.6 వేల పంట సాయాని మూడు విడతలుగా అందిస్తున్నారు. ఇప్పుడు దానిని రూ.9 వేలకు పెంచే అవకాశం ఉంది. దీంతో ప్రభుత్వంపై రూ.12 వేల కోట్ల భారం పడనుంది. ప్రస్తుత సమావేశాల్లో 19 బిల్లులు ఆమోదించే అవకాశం ఉంది.

**వరసగా ఆరోసారి బడ్జెట్ ప్రతిపాదన :** ఆర్థికమంత్రిగా వరసగా ఆరోసారి నిర్మలా సీతారామన్ బడ్జెట్ సమర్పిస్తున్నారు. ఐదు సార్లు పూర్తిస్థాయి బడ్జెట్ సమర్పించారు. ఈ సారి ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రతిపాదిస్తారు. వరసగా ఆరోసారి బడ్జెట్ సమర్పించిన మహిళ నేతగా నిర్మలా సీతారామన్ రికార్డు సృష్టించారు. మాజీ ప్రధానమంత్రి మొరార్జీ దేశాయ్ అత్యధికంగా పది సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఆ తర్వాత స్థానంలో నిర్మలా సీతారామన్ నిలుస్తారు. అరుణ్ జైట్లీ, పి చిదంబరం, యశ్వంత్ సిన్హా, మన్మోహన్ సింగ్ ఐదు సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టారు. మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ బడ్జెట్ ప్రవేశపెట్టారు. ఇందిరా తర్వాత బడ్జెట్ ప్రతిపాదించిన మహిళా నేతగా నిర్మలా సీతారామన్ నిలిచారు.

**కొత్త సంప్రదాయం :** 2014లో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరింది. అరుణ్ జైట్లీ కేంద్ర ఆర్థిక మంత్రిగా పనిచేశారు. 2014-15, 2015-16, 2016-2017, 2017-2018, 2018-2019 ఐదుసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. జైట్లీ అనారోగ్యానికి గురికావడంతో 2019-2020 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశం పీయూష్ గోయల్‌కు వచ్చింది. 2019లో మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వచ్చింది. జైట్లీ సూచనలతో నిర్మలా సీతారామన్‌కు ప్రధాని మోదీ ఆర్థిక శాఖ బాధ్యతలను ఇచ్చినట్టు తెలుస్తోంది. అలా వరసగా బడ్జెట్ ప్రవేశ పెట్టే అవకాశం వచ్చింది.

రెండో అత్యధిక బడ్జెట్ ప్రవేశపెట్టిన నేతగా రికార్డు సృష్టించారు. తన బడ్జెట్‌లో సంస్కరణలకే నిర్మలా సీతారామన్ ప్రాధాన్యం ఇచ్చారు. సూట్ కేసులా కాకుండా రాజముద్ర ఉన్న ఎరుపు రంగు వస్త్రంలో బడ్జెట్ ప్రతులను తీసుకొచ్చే సంప్రదాయానికి నిర్మలా సీతారామన్ శ్రీకారం చుట్టారు.

## సిరిసిల్లలో కేటీఆర్‌కు షాక్..

రాజన్న సిరిసిల్ల: సిరిసిల్లలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌కు షాక్ తగిలింది. ముస్తాబాద్ మండలం జడ్పీటీసీ సభ్యుడు నర్సయ్య రాజీనామా చేశారు. ఈ క్రమంలోనే పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, కార్యకర్తలు రాజీనామాలు చేశారు. వీరంతా కాంగ్రెస్ పార్టీలో చేరడానికి రంగం సిద్ధమైంది.



నిన్ననే కేటీఆర్ సిరిసిల్లలో మీటింగ్ పెట్టారు. ఇంతలోనే నేతలు రాజీనామా విషయం బయటకు వచ్చింది. అయితే వారంతా రాజీనామా చేసే యోచనతోనే కేటీఆర్ సమావేశానికి సైతం గైర్హాజరైనట్టు సమాచారం. నేడో రేపో బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన నేతలంతా కాంగ్రెస్ పార్టీలో చేరే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## గద్దర్ విషయంలో మాట నిలబెట్టుకున్న రేవంత్ సర్కార్.. గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్, జనవరి 30: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ప్రజాకవి గద్దర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ప్రజాయుద్ధ నౌక గద్దర్ విగ్రహ ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెల్లాపూర్ మున్సిపాలిటీ చేసిన తీర్మానాన్ని హెచ్ఎండీఏ ఆమోదించింది. ఈ నేపథ్యంలో విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయిస్తూ మంగళవారం నాడు రేవంత్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.

**అన్నీ తానై చూసుకున్న రేవంత్...** ప్రజా యుద్ధ నౌకగా పేరుగడించిన గద్దర్ ఇటీవల అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసిందే. ఆయన మరణించిన సమయంలో రాజకీయ పార్టీలు స్పందించిన తీరు అప్పట్లో చర్చకు దారి తీశాయి. అయితే టీపీసీసీ చీఫ్‌గా ఉన్న రేవంత్ రెడ్డి మాత్రం గద్దర్ అంతిమయాత్రలో అన్నీ తానై ముందుకు నడిపించారు.

గద్దర్ మరణ వార్త తెలిసిన వెంటనే ఆస్పత్రికి చేరుకున్న రేవంత్.. భౌతికకాయాన్ని ఎల్బీ స్టేడియంకు తరలించడం దగ్గర నుంచి అంతిమయాత్ర, అంత్యక్రియలు ఇలా అన్నింటిలో ముందుండి నిర్వహించారు. ప్రభుత్వ లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు జరిగినప్పటికీ.. అక్కడ అన్నీ చూసుకుంది మాత్రం రేవంత్ రెడ్డే.

ఒక్కమాటలో చెప్పాలంటే గద్దర్‌ను కాంగ్రెస్ తన సొంత మనిషిలా చూసుకుని ఘనంగా వీడ్కోలు పలికింది.

**చివరి కోరిక తీరేనా...** కాగా.. గద్దర్ తన కుమారుడు సూర్యను రాజకీయాల్లో తీసుకురావాలని ఎంతగానో ప్రయత్నించారు. అనుకున్నదే తడవుగా కుమారుడితో పాటు ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దలను కలిసి ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. కొత్త పార్టీ పెట్టాలన్న ఆలోచనను కూడా పక్కన పెట్టి చివరి వరకు కాంగ్రెస్ పార్టీతో సత్సంబంధాలు కొనసాగించారు. అయితే కుమారుడిని రాజకీయాల్లో ఉన్నత స్థాయిలో చూడాలన్న కోరిక తీరకుండానే గద్దర్ ప్రాణాలు వదిలారు. గద్దర్ కోరికను నెరవేర్చేందుకు కాంగ్రెస్ పార్టీ ముందుకు వచ్చింది. గద్దర్ కుటుంబానికి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఇస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. కుమారుడికి బదులుగా గద్దర్ కుమార్తె వెన్నెలకు గత ఎన్నికల్లో హైదరాబాద్ కంటోన్మెంట్ టికెట్‌ను కాంగ్రెస్ కేటాయించింది. అయితే ఆ ఎన్నికల్లో వెన్నెల ఓటమిపాలయ్యారు.




# కేటీఆర్‌పై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్...!

## తెరపైకి కొత్త వ్యూహం!.. ఏం జరగబోతోంది?

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికలపై పూర్తి స్థాయిలో ఫోకస్ చేసింది. వీలైనన్ని ఎక్కువ స్థానాలు గెలుచుకోవడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందుకోసం వ్యూహాత్మకంగా పావులు కదపాలని యోచిస్తోంది. పట్టు పెంచుకోవడంలో భాగంగా బీఆర్ఎస్‌ను బలహీనం చేయడంపై దృష్టిసారించింది. ఇందులో భాగంగా బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తోందని తెలుస్తోంది. బీఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ వేసినట్టుగా తెలుస్తోంది. ప్రణాళికలో భాగంగా సిరిసిల్లపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్ పెట్టింది. ఈ ప్రయత్నాలలో భాగంగా ఇప్పటికే ముస్తాబాద్ జెడ్పీటీసీ, పలువురు కౌన్సిలర్లు, సర్పంచులు రాజీనామాలు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పారు. వ్యూహాల్లో భాగంగా ఇప్పటికే దాదాపు 40 మున్సిపాలిటీల్లో అవిశ్వాసానికి కాంగ్రెస్ రంగం సిద్ధం చేసినట్టుగా తెలుస్తోంది. కేటీఆర్ విప్‌ను సైతం కౌన్సిలర్లు బేఖాతర్ చేస్తున్నారు. సొంత నియోజకవర్గంలో నేతల తిరుబాటుతో కేటీఆర్‌కు తలనొప్పిగా మారింది. కాగా తాజా రాజకీయ పరిణామాలతో కేటీఆర్ ఉక్కిరిబిక్కిరవుతున్నారని తెలుస్తోంది. స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు రాజీనామాల బాట పడుతుండడంతో కేటీఆర్ కలవరం చెందుతున్నారు. పార్టీ నేతలను కాపాడుకోలేక ఆయన తంటాలు పడుతున్నారని టాక్ నడుస్తోంది. నియోజకవర్గ సమావేశంలో కేటీఆర్ పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశనం చేసి 24 గంటలు కూడా గడవక ముందే ముస్తాబాద్ జెడ్పీటీసీ గుండం నర్సయ్యతో పాటు పలువురు సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, పలువురు ముఖ్యనేతలు బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. వీరంతా కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ పరిణామం కేటీఆర్‌కు తలనొప్పిగా మారినట్టు పొలిటికల్స్ సర్కిల్స్‌లో చర్చ నడుస్తోంది. కేటీఆర్‌ను అష్టదిగ్బంధనం చేసి ఊపిరి సలపకుండా చేసే ఎత్తుగడలు, వ్యూహాలకు కాంగ్రెస్ పార్టీ తెరలేపింది. ఈ మేరకు ప్రణాళికలకు హస్తం పార్టీ పదును పెట్టినట్టుగా తెలుస్తోంది. దీంతో కేటీఆర్ చుట్టూ రాజకీయం హాట్‌హాట్‌గా మారింది. ఆపరేషన్ ఆకర్ష్‌ను మొదలుపెట్టినట్టుగా పరిణామాల చూస్తే అర్థమవుతోంది. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో ఆకర్షితులవుతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మరి ఈ పరిస్థితులను బీఆర్ఎస్ ఏవిధంగా ఎదుర్కుంటుందో వేచిచూడాలి.

# సంపాదకీయం

## 28 ఏళ్ల తర్వాత భారత్ కు 'అందమైన' చాన్స్
## ఈసారి వివాదమేనా?

అప్పుడెప్పుడో 1996లో జరిగిన ఆ పోటీలు అత్యంత వివాదాస్పదం అయ్యాయి. భారత్ వంటి దేశంలో అలాంటి పోటీలా..? అంటూ కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఉద్యాన నగరిలో జరిగిన పోటీలను అడ్డుకున్నారు. అయితే, దీనిపై విమర్శలు కూడా వచ్చాయి. ప్రపంచమంతా ఆసక్తితో చూసే పోటీలను.. విజేతగా నిలిచేది ఎవరా? అని ఉత్సాహంగా చూసే పోటీలను నిర్వహించడాన్ని అడ్డుకోవడం తగదనే వ్యాఖ్యలు వచ్చాయి.

ఇప్పుడు మరోసారి అలాంటి అరుదైన అవకాశం దక్కింది.

**ప్రపంచ సుందరాంగులందరూ..** ప్రపంచంలోని అందగత్తెలందరూ ఒకచోట చేరితే ఎలా ఉంటుంది..? చూడడానికి రెండు కళ్లూ చాలవు కదూ..? వారిలో అందంతో పాటు ఆత్మవిశ్వాసమూ ఉంటే.. ఇంకేం? అతిలోక సుందరులుగానే భావించాలి. ఇలాంటి వారందరూ పోటీ పడే 71వ ప్రపంచ సుందరి పోటీలకు ఈసారి భారత్ వేదిక కానుంది. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛైర్ పర్సన్, సీఈవో జూలియా మోర్లే ఇటీవల ఈ విషయాన్ని ప్రకటించారు. మిస్ వరల్డ్ పోటీలకు ఆతిథ్యం ఇస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని ఆమె పేర్కొన్నారు.

**ఏమిటీ పోటీల ప్రత్యేకత..** ప్రపంచ సుందరి పోటీలు అంటే కేవల సుందరీమణుల పోటీలు కాదు. అందం, వైవిధ్యం, సాధికారత మూడింటినీ కలగలిపి విజేతను ఎంపిక చేస్తారు. అంటే మూర్తీభవించిన అందగత్తె అన్నమాట. ఇలాంటి వేడుకను చూసేందుకు టీవీల ముందు కోట్లాది మంది అతుక్కుపోతారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. కాగా, భారత్ లో 1996లో మిస్ వరల్డ్ పోటీలు జరిగాయి.

మళ్లీ 28 ఏళ్ల తర్వాత మన దేశం వేదికగా నిలుస్తోంది. 1996లో బెంగళూరులో నిర్వహించిన సమయంలో ఓ పార్టీ కార్యకర్తలు తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు.

**విశ్వ సుందరుల్లో మనవాళ్లు వీరే..** రీటా ఫారియా 1966లో భారత్ నుంచి తొలిగా ప్రపంచ సుందరి కిరీటం అందుకున్నారు. 1994లో ఏం జరిగిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు మనమంతా ఎంతో ఆరాధిస్తున్న ఐశ్వర్య రాయ్.. ఆ ఏడాది విజేత. ఇక 1997లో డయానా హేడెన్, 1999లో యుక్తా ముఖీ, 2000లో ప్రియాంక చోప్రా, 2017లో మానుషి చిల్లర్ 'మిస్ వరల్డ్' గా ఎంపికయ్యారు.

**రెండేళ్ల విరామం తర్వాత..** మిస్ వరల్డ్ పోటీలను 2022లో చివరిసారిగా నిర్వహించారు. అప్పట్లో పోలెండ్ భామ కరోలినా బిలాస్కా కిరీటం అందుకుంది. భారత్ లో ఈ ఏడాది గెలిచినవారికి ఆమెనే కిరీటాన్ని బహూకరించనున్నారు. కాగా, మిస్ వరల్డ్ పోటీలకు 130 పైగా దేశాల నుంచి అతివలు పాల్గొనున్నారు. అందాలతో పాటు ప్రతిభను ప్రదర్శించేందుకు పోటీ పడనున్నారు. ఫిబ్రవరి 18 నుంచి మార్చి 9 వరకు ఢిల్లీలోని భారత్ మండపం, ముంబై జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్ లో పోటీలు జరుగుతాయి. మార్చి 9న ఫైనల్స్ కు ముంబై ఆతిథ్యం ఇవ్వనుంది.

అందం మాత్రమే కాక వ్యక్తిత్వాన్ని కూడా అంచనా వేసి విజేతను ఎంపికచేయడం మిస్ వరల్డ్ పోటీల ప్రత్యేకత. సమాజంలో సానుకూల మార్పు తీసుకొచ్చే సామర్థ్యం, తెలివితేటలు ఉన్నవారిని గుర్తించి సత్కరించడం ఈ పోటీల ముఖ్య ఉద్దేశం.

# నియోజకవర్గ అభివృద్ధియే ప్రధాన లక్ష్యం

### ఎమ్మెల్యే మల్లారెడ్డి




శామీర్ పేట (గరుడ వార్త) : తనను నమ్మి ఓటేసిన తన నియోజకవర్గ అభివృద్ధియే తన ధ్యేయంగా ముందుకు సాగుతానని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పునరుద్ఘాటించారు. మంగళవారం శామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తాలోని సీఎంఆర్ కన్వెన్షన్ హాల్లో ఎమ్మెల్యే మల్లారెడ్డి శామీర్ పేట, మూడు చింతలపల్లి మండలాలు, తూముకుంట మున్సిపల్ బీఆర్ఎస్ కార్యకర్తలకు కృతజ్ఞతలను తెలిపేందుకు విజయోత్సవ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల్లో ఎంతగానో శ్రమించి, ఎంతో కష్టపడి అఖండ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారన్నారు. నియోజకవర్గం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతానన్నారు. నియోజకవర్గ ప్రజలకు నియోజకవర్గ ప్రజలకు సేవ చేసినందుకు మర్చిపోకుండా






ఎన్నికల్లో తనను మళ్ళీ ఎమ్మెల్యేగా రెండోసారి గెలిపించారని తెలిపారు. తనను గెలిపించిన నియోజకవర్గ ప్రజలందరికీ, కార్యకర్తలకు, నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం తమ కార్యకర్తలను, నాయకులను సాధించాలని చూస్తే ఊరుకునేది లేదని, కేసులు పెట్టి ఇబ్బందుల గురి చేస్తే ఎంతటి పోరాటానికైనా సిద్ధమన్నారు. తెలంగాణ సాధించుకోవడానికి ఇంతగా నువ్వు పోరాటం చేస్తామని తెలిపారు. వచ్చే ఎంపీ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికలలో తమ వారిని గెలిపించుకుంటామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ చామకూర మహేందర్ రెడ్డి, టిఆర్ఎస్ యువనాయకుడు చామకూర భద్రారెడ్డి, ఎంపీపీలు ఎల్లు బాయి, హారిక, తూముకుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వరరావు, జడ్పీటీసీ అనిత, పార్టీ అధ్యక్షులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



### సముద్రపు దొంగల నుంచి..
# పాకిస్థానీ నావికుల్ని కాపాడిన భారత్

అరేబియా సముద్రంలో 36 గంటల వ్యవధిలో భారత్ మరోసారి డేరింగ్ ఆపరేషన్ చేపట్టింది. సోమాలియా సముద్రపు దొంగల చెర నుంచి 19 మంది పాకిస్థానీ నావికుల్ని రక్షించింది. యుద్ధనౌక ఐఎన్ఎస్ సుమిత్రను రంగంలోకి దింపి సముద్రపు దొంగలను తరిమికొట్టింది. ఈ మేరకు భారత నేవీవెల్లడించింది. సోమవారం సోమాలియా తీరంలో ఇరాన్ జెండాతో ఉన్న అల్ నయీమీ ఫిషింగ్ నౌకను సాయుధ సముద్రపు దొంగలు చుట్టుముట్టారు. 19 మంది పాకిస్థానీ నావికుల్ని బంధించారు. దీనిపై సమాచారం అందుకున్న భారత యుద్ధనౌక.. ఓడను అడ్డగించి, బందీలను విడిపించింది. కొద్ది గంటల ముందు కూడా భారత్ ఇదే తరహా ఆపరేషన్ చేపట్టింది.

శనివారం రాత్రి అరేబియా సముద్రంలో ఇరాన్ చేపల బోటు ఇమాన్‌ను సోమాలియా దొంగలు అపహరించారు. రక్షించమంటూ ఈ బోటు నుంచి ఆదివారం భారత్ నౌకాదళానికి అత్యవసర సందేశం అందింది. ఐఎన్ఎస్ సుమిత్ర, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ ధ్రువ్ రంగంలోకి దిగి.. 17 మంది మత్స్యకారులను రక్షించిన సంగతి తెలిసిందే. హమాస్ లక్ష్యంగా ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో హూతీ తిరుగుబాటుదారులు గత కొద్ది రోజులుగా ఎర్రసముద్రంలో వాణిజ్య నౌకలే లక్ష్యంగా దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో ఆయిల్ ట్యాంకర్లతో వెళుతున్న మార్లిన్ లాండ నౌకపై క్షిపణితో దాడి చేశారు. ఆ నౌక నుంచి వచ్చిన అత్యవసర సందేశానికి స్పందించిన భారత నేవీ.. సమీపంలోని ఐఎన్ఎస్ విశాఖపట్నం నౌకను రంగంలోకి దింపి, సహాయ చర్యలు చేపట్టింది.

# ఆలోచనలకు పదును.. ఆవిష్కరణలకు అదను




కొత్తగూడెం : విద్యార్థులు, యువతలో దాగి ఉన్న కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలను ప్రేరేపించేలా 'ఇంటింటా ఇన్నోవేషన్' కార్యక్రమాన్ని ఏటా నిర్వహిస్తున్నారు. 2023-24 సంవత్సరానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ ఏడాది స్వాతంత్ర్య వేడుకలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల ప్రదర్శన చేపట్టనున్నారు. కొవిడ్ నేపథ్యంలో నాలుగేళ్లుగా ఆన్‌లైన్ ద్వారానే ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతోంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఆన్‌లైన్ ఎగ్జిబిషన్ లింక్ ద్వారా ఈ ఆవిష్కరణలను తిలకించవచ్చు.

దరఖాస్తులు వాట్సాప్ ద్వారా..

ఇంటింటా ఇన్నోవేషన్‌లో దరఖాస్తు చేసుకున్నవారు అంతర్జాలంలో ప్రాజెక్టును ప్రదర్శించాలి. ముందుగా తమ ఆలోచనలకు అనుగుణంగా రూపొందించిన ఏదైనా ప్రాజెక్టును వివరాలతో ఆగస్టు 5లోగా దరఖాస్తు చేసుకోవాలి. తమ ఆవిష్కరణలకు సంబంధించిన ఆరు వ్యాఖ్యలు రెండు నిమిషాల వ్యవధితో ఉన్న వీడియో, ప్రాజెక్టుకు సంబంధించిన నాలుగు చిత్రాలు, ఆవిష్కర్త పేరు, చరవాణి నంబరు, ప్రస్తుత వృత్తి, గ్రామం, జిల్లా పేరు తదితర వివరాలను 91006 78543 అనే నంబరుకు వాట్సాప్ ద్వారా పంపించాలి. వీటిని రాష్ట్ర ఇన్నోవేషన్ విభాగం పరిశీలించి జిల్లా నుంచి ఐదు ఆవిష్కరణను ఎంపిక చేస్తుంది. ఎంపిక చేసిన ఐదు ఆవిష్కరణలను, స్వాతంత్ర్య దినోత్సవం రోజున జిల్లాలో వచ్చిన వాటిలో ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారు. అదేరోజు వాటిని ఆన్‌లైన్ ద్వారా ప్రదర్శిస్తారు. ఇందులో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలతోపాటు అవార్డులను అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విజేతకు రూ.లక్ష వరకు నగదు బహుమతి ఉంటుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు ప్రతి పాఠశాల నుంచి ఒక ఆవిష్కరణను తప్పనిసరిగా పంపించేందుకు ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాల్సి ఉంటుంది.

యువత, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు అందరికీ అవకాశం కల్పిస్తూ ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నూతన ఆవిష్కరణలతో ప్రతిభను చాటేందుకు ఇది చక్కని అవకాశం. ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకుని ప్రదర్శన కనబరిస్తే రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు లభిస్తుంది. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు విద్యార్థులు చిత్రీకరించిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతోపాటు ఇన్‌స్టాగ్రామ్‌లో టీఎస్‌టీఎస్‌ఐసీ, డీఎస్‌వో, ఖమ్మం అనే ఐడీకి ట్యాగ్ చేస్తే మరింత ప్రచారం జరుగుతుంది. చలపతిరాజు, జిల్లా సైన్స్ అధికారి, భద్రాద్రి

# మహాత్మా గాంధీ వర్ధంతిని స్మరించుకుంటూ జిల్లా యంత్రాంగం ఘన నివాళులర్పించారు

జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, నేతృత్వంలో సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భముగా అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని





స్వాతంత్రోద్యమ అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. అమరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్తామనే ధృఢ సంకల్పంతో, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమం లో జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఘనంగా అన్నదానం

శామీర్ పేట, గరుడ వార్త) : శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయ ప్రాంగణంలో ఘనంగా అన్నదానం జరిగింది. మంగళవారం మండల కేంద్రం శామీర్ పేట లోని శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా అల్వాల్ ప్రాంతానికి చెందిన దంటకట్ల నిహాల్ పుట్టినరోజు సందర్భంగా వారి తల్లిదండ్రులు దంటకట్ల సురేష్- జయంతి దంపతులు, వారి కుటుంబ సభ్యులు





అన్నదానం కు రూ. 7000 అందజేశారు. అలాగే తూంకుంట కు చెందిన సోమేశ్వరరావు- రజనీ దంపతులు రవ్వ స్వీటును అమ్మవారికి నైవేద్యం సమర్పించి భక్తులకు వితరణ చేశారు. ఉమ్మడి శామీర్ పేట మండలం కు చెందిన భక్తులు, రాజు రహదారిపై వెళ్లే భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

# అయోధ్య వెళ్లినందుకు బెదిరింపులు..
## వెనక్కి తగ్గేది లేదన్న ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్..

అయోధ్య రామ్ లల్లా ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరైనందుకు తనను, తన కుటుంబాన్ని బెదిరిస్తున్నారని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ ప్రధాన మతగురువు డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ ఇలి యాసీ ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్యలో రామమందిరం కార్యక్ర మానికి హాజరైనప్పటి నుంచి తనకు బెదిరింపులు ఎదురవుతున్నాయని ఇమామ్ వెల్లడించారు. రకరకాల ఫోన్ నెంబర్ల నుంచి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. కానీ తాను మాత్రం ఎట్టి పరిస్థితు ల్లోనూ తలొగ్గేది లేదని స్పష్టం చేశారు. "శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నుంచి నాకు ఆహ్వానం అందింది. రెండు రోజులు ఆలోచించి, దేశం, సామరస్యం కోసం అయోధ్యకు వెళ్లాలని నిర్ణయించుకున్నాను. ఇలా చేసినందుకు నాకు బెదిరింపు కాల్స్ వస్తున్నారు. ఈ క్రమంలోనే నిన్న ఫత్వా జారీ చేశారు" అని ఇలియాసీ పేర్కొన్నారు.

# రక్షణ గోడలు శిథిలం.. ప్రమాదాలకు నిలయం

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి నియోజకవర్గంలో భువనగిరి, వలిగొండ, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్ మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులపై పురాతన వంతెనలు, కల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్నాయి. నిర్వహణ లేక పగుళ్లు, గుంతలు ఏర్పడి, రక్షణ గోడలు సైతం లేక ప్రమాదాలకు నిలయంగా మారాయి. వర్షాలు కురిసినప్పుడు వంతెన పైకి నీరు రావడంతో వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సాహసం చేయాల్సి వస్తోంది. ఏళ్ల తరబడి సమస్యను పాలకులకు, అధికారులకు విన్నవించుకున్నా పరిష్కారానికి నోచుకోవడం లేదని వాహనదారులు వాపోతున్నారు. నిత్యం వాహనదారులు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు.

భువనగిరి నుంచి చిట్యాల వెళ్లే ప్రధాన రహదారిపై వలిగొండలో భీమలింగం కాల్వపై ఉన్న వంతెనకు రక్షణ గోడ లేక ప్రమాదం పొంచి ఉంది. వలిగొండ నుంచి మోటకొండూరు మండలానికి వెళ్లే మార్గంలో మల్లేపల్లి వద్ద ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు, ఇరుకుగా ఉండటంతో వాహనదారులకు ఇబ్బందిగా మారింది.



వలిగొండ నుంచి పులిగిల్లకు వెళ్లే మార్గంలో మల్లేపల్లి చెరువు సమీపంలో ఉన్న కల్వర్టుకు రక్షణ గోడలు లేక ఇరుకుగా ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

సంగెం గ్రామ పరిధిలో భీమలింగం వద్ద ఉన్న మూసీపై ఉన్న వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేవు. అంతే కాకుండా వంతెనపై గుంతలు ఉండటంతో వాహనదారులు రాత్రి సమయంలో ప్రయాణం చేయాలంటే నానా అవస్థలు పడుతున్నారు. చౌటుప్పల్‌కు వెళ్లడానికి ప్రధాన రహదారి కావడంతో వందల సంఖ్యలో వాహనాలు నిత్యం నడుస్తున్నాయి. భువనగిరి మండలం బొల్లేపల్లి మధ్యలో ఉన్న మూసీ వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు లేక ప్రమాదం పొంచి ఉంది.

**ఇబ్బందులు పడుతున్నాం– దేగల అంజయ్య, ప్రయాణికుడు, కంచనపల్లి**

రక్షణ గోడలు లేక శిథిలావస్థలో ఉన్న రహదారులపై రాత్రి సమయంలో వెళ్లేప్పుడు ఎప్పుడేం జరుగుతోందని భయమవుతోంది. కాలయాపన చేయకుండా ప్రభుత్వం తక్షణమే రక్షణ గోడలు, నూతన వంతెనలు నిర్మించాలి.

**ప్రభుత్వానికి నివేదికలు పంపాం– పి.రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ, వలిగొండ**

రహదారులపై ఉన్న వంతెనలు, కల్వర్టులకు రక్షణ గోడలు ఏర్పాటు చేస్తాం. అవసరం ఉన్న చోట హైలెవల్ వంతెన నిర్మాణం చేపట్టాడానికి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే నిర్మాణ పనులు చేపడతాం.

# ఎస్టీవో కార్యాలయంలో చేతివాటం..!


కోదాడ : అయిదారు నెలలుగా జీతాలు లేక, కుటుంబం గడవని పరిస్థితుల్లో గతంలో పని చేసిన వీఆర్‌ఏలు ఉన్నారు. నూతన ప్రభుత్వం ఆ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. పెండింగ్ జీతాలు వారి అకౌంట్లో పడాలంటే కొందరికి ముడుపులు అందజేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక్కో ఉద్యోగి దగ్గర రూ.3,000 వసూల్ చేస్తూ రూ.లక్షల్లో దోపిడీకి పాల్పడుతున్నారని ఆ ఉద్యోగులు వాపోతున్నారు. కోదాడ పట్టణంలోని ఎస్టీవో కార్యాలయం ఆ దోపిడీకి వేదికైనట్లు తెలుస్తోంది.

**రెండు శాతం కమీషన్..**

గత ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దు చేసి, వారి విద్యార్హతలను బట్టి ఇతర శాఖల్లోకి జూనియర్ అసిస్టెంట్లుగా పంపించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి విధులు నిర్వర్తిస్తున్న వారికి జీతాలు రావడంలేదు. అయితే జీతం వారి బ్యాంకు అకౌంట్లో పడాలంటే ఎస్టీవో(స్టేట్ ట్రెజరీ కార్యాలయం)లో వ్యక్తిగత ఐడీ, బ్యాంకు అకౌంట్ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఇదే అదనుగా భావించి ఎస్టీవో కార్యాలయంలో పని చేసే ఓ ఉద్యోగి వారికి వచ్చిన జీతంలో రెండు శాతం కమీషన్ ఇవ్వాలని పట్టుబట్టారని ఆ ఉద్యోగులు వాపోతున్నారు. ఒక్కో ఉద్యోగి జీతం ఒక్కో నెలకు రూ.35,000 ఉండగా, అయిదు నెలల నుంచి అంటే 1,75,000 రావాల్సి ఉండగా, ఆ మొత్తంలో రెండు శాతం కమీషన్‌పై కన్ను వేశారు.

**రూ.4.5 లక్షలకు పైగా వసూలు**

కోదాడ డివిజన్ పరిధిలో సుమారు 150 మంది వీఆర్‌ఏలు ఇతర శాఖల్లో చేరి ఇప్పుడు జీతం కోసం ఎదురు చూస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి రూ.1.50 లక్షలకు పైగా జీతాలు రావాల్సి ఉంది. వాటిలో



రెండు శాతం అంటే ఒక్కో ఉద్యోగి దగ్గర రూ.3,000 వసూల్ చేసినా రూ.4.5 లక్షల వరకు వసూలవుతాయి. ఉద్యోగులందరూ మొదటి విడతలో రూ.1,500 వరకు ఇచ్చినట్లు ఓ ఉద్యోగి తెలిపారు. మిగతా రూ.1,500 కూడా రెండు, మూడు రోజుల్లో వచ్చే విధంగా ఒప్పందం చేసుకున్నట్లు తెలిసింది.

**వసూళ్లకు పాల్పడితే శాఖాపరమైన చర్యలు– రవి, జిల్లా ట్రెజరీ అధికారి, సూర్యాపేట**

కోదాడ ఎస్టీవో కార్యాలయంలో ఉద్యోగుల దగ్గర రూ.3,000 వసూలు చేస్తున్నట్లు తెలిసింది. క్షేత్రస్థాయిలో విచారణ చేస్తాం. నిజంగా డబ్బులు తీసుకుంటే సదరు ఉద్యోగిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# సమీపిస్తున్న గడువు.. పనుల్లో కదలిక కరవు



వీర్నపల్లి: అసంపూర్తి నిర్మాణాలు సౌకర్యవంతమైన ప్రయాణానికి అడ్డంకిగా మారుతున్నాయి. కొంత వేగానికే ఎగిసిపడే దుమ్ము ఇళ్లలోకి చేరి జనాలను అనారోగ్యానికి గురి చేస్తోంది. అయిదేళ్లుగా ముందుకు కదలని రహదారి విస్తరణ పనులతో వీర్నపల్లి వాసులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రం నుంచి కోనరావుపేట మండలం మరిమడ్ల వరకు రూ.25 కోట్లతో చేపట్టిన రెండు వరుసల రహదారి నిర్మాణం పూర్తయి అయిదేళ్లు గడుస్తోంది. అప్పుడే వీర్నపల్లి మండల కేంద్రంలో రహదారి విస్తరణతోపాటు ఏడు వంతెనల నిర్మాణానికి మరో రూ.25 కోట్లు మంజూరయ్యాయి. దారికి ఇరువైపులా ఇళ్లను కోల్పోయే యజమానులకు రెండు పడక గదుల ఇళ్లు మంజూరు చేశారు. వాళ్ల అంగీకారంతో గ్రామ పంచాయతీ సైతం 56 అడుగుల మేర విస్తరణ పనులకు తీర్మానం ఇచ్చింది. పనులు దక్కించుకున్న గుత్తేదారు విస్తరణకు సంబంధించి అక్కడక్కడ పనులు ప్రారంభించి వదిలేశారు. కిలోమీటరు పైగా పనులు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ గుత్తేదారు చేయడం లేదు.

**వంతెనల వద్దా అదే పరిస్థితి**

24 కిలోమీటర్ల రహదారిలో కొత్తగా ఏడు వంతెనలు నిర్మించాలి. అయిదు వంతెనలకు సంబంధించిన పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయి. అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో దారి ఇరుకుగా మారి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా ప్రదేశాల్లో ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గర్జనపల్లిలో అర కిలోమీటర్‌లో వందల సంఖ్యలో ఉన్న గుంతలు వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అక్కడా రహదారి నిర్మాణానికి అనుకూలంగా ఉన్నప్పటికీ ఆ దిశగా ప్రయత్నాలు సాగడం లేదు.

24 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం 2018లో పూర్తికాగా ఇప్పటికీ డివైడర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయలేదు. ఈ రోడ్డు నిర్వహణ గడువు సైతం ముగిసింది. అక్కడక్కడా పాడైపోయినా మరమ్మతులు చేపట్టడం లేదు. పనుల విషయమై ఆర్‌అండ్‌బి ఏఈ కిరణ్‌తో మాట్లాడగా వీర్నపల్లిలో రహదారి విస్తరణకు సంబంధించిన పనులకు నిధుల విడుదలకు విన్నవించామన్నారు. వంతెనల వద్ద అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని, రహదారికి సంబంధించిన పనులు పూర్తి కాగానే సూచిక బోర్డులు, చారలు ఏర్పాటు చేస్తామన్నారు. 24 కిలోమీటర్లకు సంబంధించిన రోడ్డు నిర్వహణ గడువు ముగిసిందని పాడైన రోడ్డును పరిశీలించి మరమ్మతులకు నివేదిస్తామని చెప్పారు.

**అవాంతరాలతో...**

విస్తరణ పనులు చేపట్టాలంటే రహదారి నిర్మాణానికి అడ్డంగా ఉన్న విద్యుత్తు స్తంభాల తొలగింపు, తాగు నీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్ వేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన అంచనాలు రూపొందించినప్పటికీ నిధులు విడుదల చేయలేదు. ఆరు నెలల క్రితం కలెక్టర్ పనులు పరిశీలించి వేగం పెంచాలని చెప్పినప్పటికీ కదలిక కనిపించడం లేదు. రోడ్డు నిర్మాణానికి అంగీకరించిన 80 మందికి రెండు పడక గదుల ఇళ్లు మంజూరయ్యాయి. నిర్మాణంలో ఉన్న ఇళ్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం కారణంగా లబ్ధిదారులు సైతం ఆగ్రహంగా ఉన్నారు. పనులు ప్రారంభిస్తే వారి నుంచి ఆందోళనలు వ్యక్తమయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పట్లో పనులు ప్రారంభించకుంటే మళ్లీ వర్షాకాలంలో పనులు వాయిదా పడే అవకాశాలు ఉన్నాయి. అలాగే ఈ పనులకు సంబంధించిన టెండర్ గడువు మార్చితో ముగియనుంది.

# ముందస్తు జాగ్రత్తలే.. మాతా, శిశువులకు రక్ష

కొత్తగూడెం : మన్యం జిల్లా భద్రాద్రి కొత్తగూడెంలో మాతా, శిశు మరణాలపై మరింత దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఇటీవల రామవరంలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి కాన్పు కోసం వచ్చిన గర్భిణి, గర్భస్థ శిశువు మృత్యుపాలైన వైనం ఆందోళన కలిగిస్తోంది. ముందస్తుగా గర్భిణులను పరీక్షించి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడంలో తలెత్తిన లోపాలే మాతా, శిశు మరణాలకు కారణమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత, కొరవడిన పర్యవేక్షణతో గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రైవేటు ఆసుపత్రులకు ఎవరినీ తరలించకూడదని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. కానీ ప్రభుత్వ ఆసుపత్రుల్లో విధులు నిర్వర్తిస్తున్న కొందరు వైద్యులకు ప్రైవేటు క్లినిక్‌లు ఉండటం, వాటి నిర్వహణపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు. వారి క్లినిక్‌లో వైద్య సేవలందించి.. ఆ తర్వాత ప్రభుత్వ ఎంసీహెచ్‌లో కాన్పులు చేస్తున్నారనే విమర్శలూ వినిపిస్తున్నాయి.

ప్రాథమిక స్థాయిలో పర్యవేక్షణ కీలకం గర్భిణుల నమోదు ప్రక్రియ నుంచే వారి ఆరోగ్య స్థితిపై పీహెచ్‌సీల్లో నివేదికలు రూపొందిస్తున్నారు. గత కాన్పు వివరాలు? ప్రస్తుత ఆరోగ్యం? ఇతర అనారోగ్య సమస్యలను ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇతర సిబ్బంది గుర్తిస్తున్నారు. ఆ తర్వాత వైద్యులు పరీక్షలు చేస్తున్నారు. కాన్పు సమయానికి ముందే దవాఖానాల్లో చేర్పిస్తున్నా మాతా, శిశు మరణాలు సంభవిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా హైరిస్క్ కేసుల్లో తల్లీబిడ్డల ప్రాణాలు కాపాడే విషయమై పర్యవేక్షణ కొరవడుతోందని సుజాతనగర్ మండలం గర్భిణి మృతి ఉదంతం స్పష్టం చేస్తోంది. ప్రభుత్వాసుపత్రుల్లోని తగిన వైద్యసిబ్బంది నియామకం, వెంటిలేటర్లు, ఆక్సిజన్ యూనిట్లు, ఇతర పరికరాలపై వైద్యాధికారులు, కలెక్టర్ ప్రత్యేక చొరవచూపాల్సిన అవసరం ఉంది. ప్రైవేటు క్లినిక్‌లపైనే దృష్టి సారిస్తున్న కొందరు వైద్యులపైనా నిఘా ఉంచాలి. ఎంసీహెచ్‌లోనే బ్లడ్ బ్యాంకు, ఔషధాల స్టోర్ అందుబాటులోకి తీసుకురావాలని బాధితులు కోరుతున్నారు.

**జిల్లాలో.. నమోదైన**

గర్భిణులు: 6,876

హైరిస్క్ కేసులు: 512

బాలింతలు: 1,2542023లో మాతృ మరణాలు: 3'మన్యం జిల్లాలో మాతా, శిశు మరణాలను సున్నా శాతానికి నివారిం చాలి. గర్భం దాల్చినప్పటి నుంచి నిరంతరం పరీక్షలు చేసి రక్తహీనత బారినపడకుండా గర్భిణులను కాపాడాలి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా ప్రోత్సహించాలి. ప్రతి చిన్నకారణంతో పై ఆసుత్రులకు రిఫర్ చేసి ఇబ్బంది పెట్టడం తగదు.'ఇటీవల వైద్యారోగ్య శాఖపై జరిగిన సమీక్షలో కలెక్టర్ ప్రియాంక సూచనజిల్లాలో మాతా, శిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. కలెక్టర్ ఆదేశాలతో ఎంసీహెచ్ వైద్యసేవలను పర్యవేక్షి స్తాం. వైద్యసిబ్బంది కొరత, వసతులు వంటి సమస్యలను ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం. గర్భిణుల ఆరోగ్య సంరక్షణపై అవగాహన కార్యక్రమాలను విస్తృతపరుస్తాం. డా.జేవీఎల్ శిరీష, డీఎంహెచ్ఓ

# కాలువ మట్టిలో కాసులు!



కొండపాక : కాళేశ్వరం ప్రాజెక్టు కాలువల నుంచి అక్కమార్కులు మట్టిని తరలిస్తున్నారు. ప్రభుత్వ విభాగాలేవీ పసిగట్టి అడ్డుకోకపోవడంతో విచ్చలవిడిగా రాత్రింబవళ్లు అక్రమార్జన కొనసాగుతోంది. మల్లన్నసాగర్ జలాశయం నుంచి నీటిని తరలించేందుకు వీలుగా కుకునూరుపల్లి, తిప్పారం, మంగోల్, ముద్దాపూర్ గ్రామాల నుంచి భారీ ఓపెన్ కాలువలు నిర్మించారు. ఓపెన్ కాలువల నిర్మాణంలో భాగంగా కాలువలకు ఇరువైపులా భారీగా మట్టి నిల్వలు ఏర్పడ్డాయి. ఆ మట్టిపై కొందరు కన్నేశారు. దందాకు తెరలేపారు.

**అనుమతులు ఇవ్వకున్నా..**

కాలువ మట్టిని సుదూర ప్రాంతాలకు తరలిస్తూ ఆర్జిస్తున్నారు. తీసుకెళ్లేందుకు ఎవరికీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. ఇష్టారీతిన హిటాచీలు, జేసీబీలు పెట్టి తవ్వుతూ టిప్పర్లలో వేసుకెళ్తున్నారు. రెవెన్యూ, మైనింగ్, పోలీసు అధికారులు దందాకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా రాజీవ్ రహదారిపై మట్టిని తీసుకెళ్తున్నారు. రాజీవ్ రహదారి చుట్టుపక్కల స్థిరాస్తి వ్యాపారం జోరుగా సాగుతోంది. సమీప ప్రాంతాల్లో వెంచర్లు, గృహనిర్మాణాలు, భారీ భవనాలు చేపట్టడంతో మట్టికి బాగా డిమాండ్ ఏర్పడింది. వాటికి అక్రమార్కులు అందిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు.

**నిల్వలు ఖాళీ**

మల్లన్నసాగర్ కాలువ మట్టిని రోజుకు సుమారు 40 టిప్పర్లలో గజ్వేల్, కుకునూరుపల్లి చుట్టుపక్కల గ్రామాలకు తీసుకెళ్తున్నారు. ట్రిప్పునకు రూ.3 వేల చొప్పున సొమ్ము చేసుకుంటున్నారు. సెలవు రోజులు శని, ఆది వారాల్లో రూ.లక్ష అమ్మకాలు సాగిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో కాలువలకు ఇరువైపులా మట్టి నిల్వలు ఖాళీ అయ్యే పరిస్థితులు ఉన్నాయి. కాలువలకు రక్షణగా ఉన్న మట్టి గుట్టలు లేకపోతే అవి శిథిలమయ్యే ప్రమాదం పొంచి ఉంది. ప్రభుత్వ విభాగాల నుంచి అనుమతులు తీసుకొని ఎవరైనా తరలించాల్సి ఉంటుంది. ప్రభుత్వానికీ ఆదాయం వస్తుంది. అక్రమార్జనతో ఆదాయానికి గండి పడుతోంది. అధికారులకు గతంలో సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. తరలింపు వెనుక ఎంతటి వారైనా చర్యలు తీసుకొని మట్టిని కాపాడాలని కోరుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటాం–శ్రీనివాసరావు, నీటిపారుదల విభాగం ఏఈ, కుకునూరుపల్లి**

మల్లన్నసాగర్ జలాశయం నుంచి వచ్చే కాలువకు ఇరువైపులా ఏర్పడిన మట్టిని అక్రమంగా తవ్వకాలు చేపట్టి తరలిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. వాహనాలు స్వాధీనం చేసుకుంటాం. ఇప్పటికే మా దృష్టికి వచ్చింది. అధికారులకు నివేదించి అనుమతులు లేకుండా చేస్తున్న వారిపై పోలీసు కేసులు నమోదు చేస్తాం.

# మళ్లీ టెండర్లు..!

హుజూర్‌నగర్ : సీఎంఆర్ ధాన్యం అమ్మకానికి మళ్లీ ఈ–గ్లోబల్ టెండర్లు పిలవాలని ప్రభుత్వం నిర్ణయించింది. విధి విధానాలు తయారు చేసేందుకు ప్రత్యేకంగా కమిటీని కూడా ఏర్పాటు చేశారు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్‌పై ప్రత్యేక చర్యలు తీసుకుంటుండటంతో నూతన విధి విధానాలు ఎలా ఉంటాయోనని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లర్లు ఎదురు చూస్తున్నారు. టెండరు విధి విధానాల ఏర్పాటుకు ప్రత్యేకంగా కమిటీ వేయడంతో ఈసారి టెండర్ ప్రక్రియ పకడ్బందీగా ఉంటుందని మిల్లర్లు అంటున్నారు. సీఎంఆర్ సేకరణలు సక్రమంగా జరగడంలేదని, ఆ ధాన్యం వర్షానికి తడిసిందని, వివిధ కారణాలతో మిల్లులకు ఇచ్చిన ధాన్యాన్ని కొంత భాగం వేలం వేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి దశలో రాష్ట్రవ్యాప్తంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వేలం వేయాలని నిర్ణయించారు. అప్పటి టెండరు విధానాలతో మధ్య తరగతి మిల్లర్లకు అసలు టెండర్లలో పాల్గొనే అవకాశం లేకుండా పోయింది. తరువాత విధి విధానాలు సవరించడంతో వారికి కొంత ఉపశమనం లభించినట్లయింది.

**ఉమ్మడి జిల్లాలో**

ఉమ్మడి జిల్లాలో 14.67 లక్షల మెట్రిక్ టన్నుల యాసంగి ధాన్యం మిల్లులకు కేటాయింపులు చేశారు. యాసంగి సీఎంఆర్ ధాన్యంలో కొంత వేలం వేసేందుకు ప్రయత్నాలు జరిగాయి. టెండరు ప్రక్రియ కొంత మేరకు ముందుకు పోయింది. కానీ ఆ ప్రక్రియపై రాష్ట్ర వ్యాప్తంగా విమర్శలు తలెత్తాయి. ఈలోగా రాష్ట్రంలో ప్రభుత్వం



మారడంతో సీఎంఆర్ విధానాలపై అనేక మార్పులు, చేర్పులు చేపట్టింది. అందులో భాగంగా ప్రభుత్వం టెండర్లను రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని నిర్ణయించింది.

ఉమ్మడి జిల్లాలో 2022–23 సంవత్సరం వానాకాలం, యాసంగి సంబంధించిన సీఎంఆర్ బియ్యం ఇచ్చేందుకు జనవరి 31 వరకు గడువు ఇచ్చింది. దీని తరువాత ఎలాంటి గడువులు ఉండబోవని ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వుల్లచి పేర్కొన్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 2022–23 వానాకాలం సీజన్‌కు సంబంధించి దాదాపు 7,01,374 మెట్రిక్ టన్నుల బియ్యం లక్ష్యంగా ఉండగా జనవరి మొదటి వారం వరకు 6,00,147 మెట్రిక్ టన్నులు వసూలు అయింది. ఇంకా 1,01,227 మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉంది. యాసంగికి ఉమ్మడి జిల్లా నుంచి 9,87,515 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం లక్ష్యంగా ఉండగా గత నెల 18నాటికి 1,92,515 మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణలు జరిగాయి.

# బాలల వైజ్ఞానిక ప్రతిభ భళా

కొత్తగూడెం : విద్యార్థుల్లోని సృజనాత్మకత, ప్రతిభను వెలికితీసే వైజ్ఞానిక ప్రదర్శనలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని తమ నమూనాలతో ఆకట్టుకున్నారు. ఈ నెల 23 నుంచి 25 తేదీ వరకు రంగారెడ్డి జిల్లాలో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ జరిగింది. మొత్తం 25 అంశాలు దక్షిణ భారత స్థాయి ప్రదర్శనకు పోటీపడ్డాయి. వాటిల్లో ఏకంగా నాలుగు నమూనాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచే ఎంపిక కావడం విశేషం. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు విజయవాడలో జరిగే సౌత్ ఇండియా స్థాయి ప్రదర్శనలోనూ విద్యార్థులు రాణిస్తారని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి, జిల్లా సైన్స్ అధికారి చలపతిరాజు ఆకాంక్షించారు. విద్యార్థులకు విష్ణుప్రియ, జ్యోతి, వాజీద్, కె.జ్యోతిలు మార్గదర్శులుగా వ్యహరించారు.

ప్రాజెక్టు: స్మార్ట్ హెల్మెట్

రూపకర్త: రామ్‌చరణ్, 9వ తరగతి, చంద్రుగొండ మండలం జడ్పీ ఉన్నత పాఠశాల

ఉపయోగం: నేడు ఎంతో మంది ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించని కారణంగా రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. హెల్మెట్ ధరిస్తే మాత్రం ప్రమాద తీవ్రత తగ్గి గాయాలతో బయటపడుతున్నారు. శిరస్త్రాణాన్ని ధరించడం తప్పనిసరని చట్టాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక వాహనదారుడు 'స్మార్ట్ హెల్మెట్' ధరించడం ద్వారా సురక్షిత ప్రయాణాన్ని, బహుళ ప్రయోజనాలను పొందగలడు. ఇది జీఎస్ఎం, జీపీఎస్ సాంకేతికతో తయారుచేసినది. సెన్సార్లను మైక్రో కంట్రోలర్ బోర్డుకు అనుసంధానం చేస్తారు. కంట్రోలర్‌కు ఇంటర్‌ఫేస్ అయిన జీపీఎస్ మాడ్యూల్‌ను ఉపయోగించి జీపీఎస్ డేటాను సంగ్రహిస్తోంది. హెల్మెట్ ధరించిన వ్యక్తి ప్రమాదానికి గురైన వెంటనే జీఎస్ఎం మాడ్యూల్ స్వయంచాలక పాత్ర పోషించి అంబులెన్స్, కుటుంబ సభ్యులకు సందేశాన్ని పంపుతుంది. ఎవరైనా మందు తాగినా సెన్సార్లు పసిగట్టి హెచ్చరిస్తాయి.

ప్రాజెక్టు: స్మార్ట్ అగ్రి రోబో

రూపకర్త: వరుణ్‌కుమార్, 9వ తరగతి, ఇల్లెందు సింగరేణి కాలరీస్ హైస్కూల్

ఉపయోగం: ప్రతికూల వాతావరణం, విపత్తులు రైతులకు నష్టాన్ని కలిగిస్తున్నాయి. ఈ క్రమంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 'స్మార్ట్ అగ్రి రోబో'లు తక్కువ కమతాలు కలిగిన వారికీ లాభసాటిగా మారుతున్నాయి. ఈ పరికరం తేమ, ఉష్ణోగ్రతల సమాచారమిస్తుంది. రాగల కొన్ని రోజులకు సంబంధించిన వర్షపాతాలను అంచనా వేస్తుంది. భూసారం, తేమ శాతాన్ని నిర్ధారిస్తూ మొక్కల సంరక్షణకు సూచనలు చేస్తుంది. దుక్కి దున్నడం, చదును చేయడం, విత్తనాలు వేయడం, ఇతర పరికరాలను సెన్సార్ సాయంతో సమర్థంగా వినియోగించుకునేందుకూ చిట్టి రోబోలు దోహదపడతాయి.

ప్రాజెక్టు: లిక్విడ్ బయో ఎంజైమ్

రూపకర్త: దీప్షిక, హర్షిత, 9వ తరగతి, త్రివేణి పాఠశాల, లక్ష్మీదేవిపల్లి

ఉపయోగం: లిక్విడ్ ట్రీ (ద్రవరూప చెట్టు).. వాయు కాలుష్యాన్ని పరిష్కరించడానికి అభివృద్ధి చేసిన బయో టెక్నాలజీ ఆవిష్కరణ ఇది. దీని నిర్మాణం 600 లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకుతో కూడి ఉంటుంది. ఇదంతా మైక్రో ఆల్గేతో కూడిన'మైక్రో ఆల్గే (సూక్ష్మ శైవలాలు)' నిండి ఉంటుంది. ఇది కిరణజన్య సంయోగక్రియ ద్వారా పర్యావరణంలోని 'సీఓటూ'ను బంధిస్తుంది. దాన్నుంచి స్వచ్ఛమైన ఆక్సిజన్‌ను విడుదల చేయడానికి కావాల్సిన ప్రాసెస్ 'లిక్విడ్ ట్రీ' చేస్తుంది. ఈ వ్యవస్థలో సోలార్ ఆధారిత, అంతర్‌నిర్మిత లైటింగ్ వ్యవస్థ ఉంటుంది. ఏడాది పొడవునా శీతాకాలం వంటి ఆవరించినా.. వాతావరణంలో కిరణజన్య సంయోగక్రియకు 'మైక్రో ఆల్గేలు' దోహదపడతాయి.

ప్రాజెక్టు: హిమోడయాలసిస్ వర్కింగ్ మోడల్

రూపకర్త: చరితశ్రీ, ధన్యశ్రీ, 9వ తరగతి, గౌతమ్ మోడల్ స్కూల్, భద్రాచలం

ఉపయోగం: మూత్రపిండ వైఫల్యం కారణంగా శరీరం అదనపు నీరు, వ్యర్థ పదార్థాలతో నిండి ఉంటుంది. ఈ పరిస్థితిని యురేమియాగా పేర్కొంటారు. రెండు కిడ్నీలూ చెడిపోయిన వ్యక్తి రక్తాన్ని డయాలసిస్ యంత్రాలతో శుద్ధిచేస్తారు. ఈ ప్రక్రియలో రక్తాన్ని హెపారిన్ వంటి ప్రతిస్కందకంతో కలిపి.. ప్రధాన ధమని నుంచి బయటకు తీసి.. డయలైజర్ అనే ఉపకరణంలోకి పంపింగ్ అవుతుంది. అనంతరం ఛానళ్ల ద్వారా ప్రవహించే రక్తంలోంచి మలినాలు, వ్యర్థ ద్రవాల్ని ఆధునిక పరికరాల సాయంతో వేరుచేస్తారు. ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పొందిన 'హిమోడయాలసిస్' గురించి విద్యార్థిని ఆకట్టుకుంటోంది.

## ఆటకు బానిసలు.. ఆడేందుకు అడ్డదారులు!

హైదరాబాద్: సరదా ఆటతో వినోదం.. మరోవైపు అదనపు సంపాదన మీ సొంతం. లింకుల్లో కనిపించే ప్రకటనలకు ఆకర్షితులవుతున్నారు. ఆన్‌లైన్ గేమింగ్, టాస్క్‌ల మోజులో పాఠశాల విద్యార్థుల నుంచి గృహిణుల వరకు మోసపోతున్నారు. నగర పరిధిలో గడిచిన 20 రోజుల్లో సైబర్ నేరస్థుల చేతిలో రూ.10 కోట్ల మేర నష్టపోయారు. వీరిలో ఆన్‌లైన్ గేమింగ్ బాధితులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. విద్యాసంస్థలు, కార్పొరేట్ కార్యాలయాలు, పనిచేసే ప్రదేశాల్లో పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా అప్రమత్తం చేస్తున్నారు. అయినా ఏదో ఒక రూపంలో ప్రజలు మోసపోతూనే ఉన్నారు. ఆటకు బానిసలైన కొందరు గేమ్స్ కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. నేరస్థులుగా పోలీసు రికార్డుల్లోకి చేరుతున్నారు.

ఎందుకీ మోజు అంటే..

ఇటీవల గేమింగ్ వెబ్‌పోర్టల్ ద్వారా రూ.70 లక్షలు పోగొట్టుకున్న బాధితురాలి ఫిర్యాదుతో నగర సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విదేశాల్లోని సైబర్ నేరస్థులకు బ్యాంకు ఖాతాలు




అందజేస్తున్న నిందితుడు హితేష్‌గోయల్‌ను అరెస్టు చేశారు. ఈ ఒక్క గేమింగ్ వెబ్‌సైట్ ద్వారా దేశవ్యాప్తంగా 200 మంది రూ.100 కోట్ల మేర నష్టపోయినట్లు అంచనాకు వచ్చారు. నగరానికి చెందిన గృహిణి రూ.21 లక్షలు మోసపోయారు.

తప్పుచేసి తప్పటడుగులు

నగరానికి చెందిన మహిళ ఆన్‌లైన్ గేమింగ్‌కు అలవాటుపడ్డారు. వాహనదారులను లిఫ్ట్ బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజేవారు. చేతిలో సొమ్ము పడగానే వెంటనే గేమింగ్ యాప్‌నకు డబ్బు జమచేసి ఆడటం అలవాటుగా మారింది. సికింద్రాబాద్‌కు చెందిన యువకుడు దీనికి అలవాటై చోరీలకు పాల్పడుతున్నాడు. 3 నెలల వ్యవధిలోనే 12 దొంగతనాలు చేశాడు. కొట్టేసిన నగలును ప్రైవేటు ఫైనాన్స్‌ల్లో తాకట్టుపెట్టి ఆటకు వెచ్చించేవాడు.

## నిధులున్నా.. నిస్తేజం!

తాండూరు–చించోళి జాతీయ రహదారి నిర్మించేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. టెండరు దక్కించుకున్న గుత్తేదారు పనులు చేపట్టి, పట్టణ శివారులో వడివడిగా కొనసాగించారు. అనంతరం అర్ధంతరంగా ఆపేశారు. దీంతో గుంతల మార్గంలో ప్రయాణం ప్రయాసలకు గురిచేస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ నుంచి తాండూరు మీదుగా కర్ణాటక మన్నెక్కెల్లి వరకు జాతీయ రహదారి 167 నిర్మించేందుకు కేంద్రం రూ.682 కోట్లు మంజూరు చేసింది.

కంకర వేసి..: గౌతాపూర్ శివారు నుంచి పట్టణంలోని బస్టాండు వరకు రహదారికి ఇరువైపులా కాల్వలను నిర్మించారు. గౌతాపూర్ శివారు నుంచి యాలాల మండలం రాసులపురం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు రెండు వరసల్లో తారు రహదారి నిర్మించారు. సెయింట్ మార్క్స్ పాఠశాల నుంచి పైవంతెన వరకు రహదారి మధ్యలో విభాగినులు ఏర్పాటు చేశారు. నాలుగు వరసల రహదారి నిర్మించేందుకు గౌతాపూర్ మోత్కు వాడ్క నుంచి భవానీ వేడుక వేదిక స్వాగత ద్వారం వరకు రహదారి వారగా నేలను చదును చేసి, నాలుగైదు అడుగుల లోతు వరకు మొరంవేసి, కంకర వేశారు. తారు పనులు చేపట్టాల్సి ఉండగా మూడు నెలలుగా ఊసెత్తడం లేదు. రెండు వరసల రహదారిని ఆనుకుని కంకర వేసి వదిలేయడంతో ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు రహదారి కిందకు వెళ్లే పరిస్థితి లేకుండా



పోయింది. రాత్రిపగలూ రద్దీగా ఉండే ఇరుకు మార్గంలో 5వేలకుపైగా రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడుతున్నారు.

పదిహేను కిలోమీటర్లు గుంతలమయం: కొత్లాపూర్ శివారులో కర్ణాటక సరిహద్దు నుంచి కోటబాస్పల్లి, ఐనెల్లి, జిన్‌గుర్తి, సిరిగిరిపేట, అల్లాపూర్, రాంపూర్ గేటు, గౌతాపూర్ వద్ద, యాలాల మండలం రాశులపురం, లక్ష్మీనారాయణ్‌పూర్, చెన్నారం, దౌలాపూర్, జుంటిపల్లి గేటు వరకు తారు రహదారి గుంతలతో దెబ్బతిన్నది. కొన్నిచోట్ల అడుగులోతు గుంతలుపడటంతో వాహనదారులకు తిప్పలు తప్పడంలేదు. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో ప్రయాణించి ఒళ్లు నొప్పులభారిన పడుతున్నారు. తాండూరు మండలంలో ఐదు సిమెంటు కర్మాగారాలు, వందల సంఖ్యలో నాపరాయి గనులు ఉండడంతో పరిశ్రమల లారీలు, ట్యాంకర్లు, టిప్పర్ల రాకపోకలతో రహదారి అధ్వానంగా మారింది. కేంద్రం మంజూరు చేసిన నిధులతో జాతీయ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేస్తే ప్రయాణ బాధలు తీరనున్నాయి. ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాల్సి ఉంది.

## వట్టిపోతున్న వనరులు.. వన్యప్రాణులకు తిప్పలు



తాండూరు : జిల్లాలోని అడవుల్లో నీటి వనరులు ఒట్టిపోయాయి. కొన్నింటిలో మాత్రమే నిల్వ ఉన్నా, ఎండలు ముదిరితే ఖాళీ కానున్నాయి. ఈ పరిణామం వన్యప్రాణుల తాగు నీటిపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఇదే జరిగితే అటవీప్రాంతంలోని జంతువులు గ్రామాల్లోకి వచ్చే ప్రమాదంతోపాటు, వాటికి వేటగాళ్ల నుంచి ముప్పు పొంచి ఉంది. మరోవైపు హైనా, తోడేళ్లు, నక్కలతో జీవాలకు ప్రమాదం వాటిళ్లవచ్చు. ఈ సమస్యను పరిష్కరించాలంటే అధికారులు తాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉంది.

1.08 లక్షల ఎకరాల్లో విస్తరించిన అడవులు: తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ రేంజ్‌ల పరిధిలో 1.08లక్షల ఎకరాల్లో అడవి విస్తరించిఉంది. 74 బీట్లు, 27 సెక్షన్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది అడవులను పర్యవేక్షిస్తున్నారు. అనంతగిరి, దామగుండం, జిన్‌గుర్తి, ధారూర్, తట్టేపల్లి, అడ్కిచర్ల, పరిగి పరిధిలోకి వచ్చే మహమ్మదాబాద్( కొంతభాగం), రాస్నం, నాగులపల్లి అడవులు దట్టంగా ఉన్నాయి. మిగిలిన గ్రామాల సమీపం అడవులు కొంత పలుచగా ఉన్నాయి. వీటిల్లో దుప్పులు, నక్కలు, తోడేళ్లు, హైనాలు, కుందేళ్లు, పందులు, జింకలు, కొండగొర్రెలు, నీలుగాయి వంటి తదితర జంతువులు జీవిస్తున్నాయి.

సాసర్ పిట్‌లు అంతే..: అడవుల్లో జంతువుల ఎద్దడిని తీర్చేందుకు అధికారులు మూడేళ్ల కిందటే 250కి పైగా సాసర్‌ఫిట్‌లను నిర్మించారు. చెక్‌డ్యాంలు, కుంటల్లో నీరు అడుగంటగానే ట్యాంకర్ల ద్వారా తెచ్చిన నీటిని సాసర్ పిట్‌ల్లో పోస్తే జంతువులు వచ్చి తాగేవి. ఒక్కో సాసర్ పిట్‌లోని నీరు వారం నుంచి పది రోజుల వరకు జంతువుల దాహార్తిని తీరుస్తుంది. ఫిబ్రవరి తృతీయార్థం నుంచి అధికారులు వీటిల్లో నీళు నింపుతారు. ప్రస్తుతం జనవరిలోనే చెక్‌డ్యాంలు, కుంటలు వెలవెలబోతున్నాయి.

చెక్‌డ్యాంలు, కుంటల నిర్మాణం

జంతువులు, పక్షుల దాహార్తిని తీర్చేందుకు 200 చెక్‌డ్యాంలు, 180 కుంటలు నిర్మించారు. అటవీ ప్రాంతం చుట్టూరా కిలోమీటర్ల కొద్ది కాలువలను తవ్వించారు. వర్షాకాలంలో ఎగువ నుంచి వచ్చిన వరదంతా వీటిలో చేరడంతో జలకళ సంతరించుకున్నాయి. దీంతో వన్యప్రాణులకు ఇబ్బందులు ఎదురుకాలేదు. ఇటీవల వర్షాలు లేకపోవడం, వ్యవసాయానికి ఎక్కువగా నీటిని వినియోగించడం, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వనరులు అడుగంటి పోయాయి. అక్కడక్కడ మాత్రమే నీళ్లున్నా, ఎక్కువ రోజులు వచ్చే అవకాశం లేదు. ప్రస్తుతం గ్రామాలకు సమీపంలో ఉన్న వాగుల వద్దకు వచ్చి వణ్యప్రాణులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. మరికొన్ని వ్యవసాయ క్షేత్రాలు, పొలాల వద్దకు వెళుతున్నాయి.ఉన్నతాధికారులకు నివేదించి చర్యలు తీసుకుంటాం– జ్ఞానేశ్వర్, జిల్లా అటవీశాఖాధికారిఅద్దె ప్రాతిపదికన తెచ్చే ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి సాసర్‌పిట్‌లో పోయించి డబ్బులను చెల్లించే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా ఇతర మార్గాలను అన్వేషిస్తున్నాం. అడవులకు దగ్గరలో ఉన్న పంచాయతీల ట్యాంకర్లను వినియోగించాలని ఆలోచిస్తున్నాం. డీజిల్ ఖర్చును భరించే విషయమై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

## నోరు మెదపరు.. కాలు కదపరు



హైదరాబాద్ : గతేడాది ఫిబ్రవరి నుంచి గుత్తేదారులకు బిల్లుల చెల్లింపు జరగట్లేదు. బకాయి రూ.1200 కోట్లకు పెరిగింది. దీంతో రూ.1000 కోట్ల వ్యయంతో కాలనీల్లో చేపట్టే రోడ్లు, నాలాల టెండర్లకు గుత్తేదారులు ముందుకు రావడంలేదు. సర్కారుకు వాస్తవాలను వివరించడానికి జీహెచ్ఎంసీ ప్రయత్నం చేయట్లేదనే విమర్శలున్నాయి. జీహెచ్ఎంసీ నిర్లక్ష్యం వల్ల రూ.వేల కోట్ల అభివృద్ధి పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కనీసం ఏడాదిగా ఆయా పనులపై సమీక్ష జరగలేదు. అత్యవసర పనుల గురించీ పట్టింపు కరవైంది. రానున్న వర్షాకాలానికి అవసరమైన సన్నద్ధత కూడా బల్దియా గాలికొదిలేసింది. గతంలో జనవరి నెలలో నాలాల పూడికతీత మొదలయ్యేది. రోడ్ల మరమ్మతులు, ఇతరత్రా నిర్వహణ పనులకు టెండర్లు పిలిచేవారు. ఫిబ్రవరి వస్తున్నా.. కేంద్ర కార్యాలయం నిద్రమత్తు వీడలేదు. అలాగే.. లింకు రోడ్లు, పైవంతెనల పనులు ఆగిపోయాయి. శంకుస్థాపనలు జరిగిన కాలనీ రోడ్ల నిర్మాణం ముందుకు సాగట్లేదు. ఇలాంటి మరెన్నో సమస్యలు నగరంలో తిష్ఠ వేశాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. నగరంలో పాలన స్తంభించి జనాలు అవస్థలకు గురవుతారనే ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉన్నతాధికారులూ.. ఇదీ పరిస్థితి

నాలాల పూడికతీత ఏడాది పొడవునా జరగాలి. గతేడాది వర్షాకాలం పూర్తయ్యాక పనులు ఆగాయి. ఈ ఏడాదికి సంబంధించి గతేడాది డిసెంబరులోనే టెండర్లు పిలవాల్సి ఉండగా.. ఇంకా ప్రక్రియ మొదలు కాలేదు. ఎస్ఎన్‌డీపీ కార్యక్రమంలో భాగంగా మూడేళ్ల క్రితం రూ.985 కోట్లతో చేపట్టిన నాలాల అభివృద్ధి పనులు 70 శాతం దాటలేదు. ఎస్ఆర్‌డీపీ కింద పైవంతెనలు, అండర్‌పాస్‌ల వంటి రూ.3 వేల కోట్ల పనులు పురోగతిలో ఉన్నాయి. వాటిని పూర్తి చేసేందుకు రూ.1,600 కోట్లు అవసరం. అసంపూర్తి పనులతో ప్రజలు ట్రాఫిక్ సమస్య, రోడ్డు ప్రమాదాలతో సతమతమవుతున్నారు.

రూ.250 కోట్లతో చేపట్టిన రెండో దశ లింకు రోడ్ల నిర్మాణం నిధుల సమస్యతో ఎక్కడికక్కడ నిలిచిపోయింది.

బల్దియాలోని జోనల్, డిప్యూటీ కమిషనర్లు క్షేత్రస్థాయిలో పర్యటించడం లేదు. దీంతో పారిశుద్ధ్యం గాడితప్పింది. దీనిపై కమిషనర్ రోనాల్డ్‌రాస్ కనీస చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

## సమీకృత మార్కెట్ సేవలెప్పుడో..?

జగిత్యాల : రైతులు పండించే అన్ని ఉత్పత్తులతోపాటు దిగుమతి చేసుకున్న ఇతరత్రా వస్తువులన్నీ ఒకేచోట వినియోగదారులకు అందించే సమున్నత లక్ష్యంతో పట్టణంలో ఏడాదిన్నర క్రితం సమీకృత మార్కెట్ సముదాయ నిర్మాణాన్ని రూ.6 కోట్లతో చేపట్టారు. పట్టణ నడిబొడ్డున ఉన్న జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు 2 ఎకరాల విశాలమైన స్థలంలో రెండు పెద్ద షెడ్లు నిర్మించారు. జిల్లాకేంద్రంలో అన్ని రకాల ఉత్పత్తులు టోకు, రిటైయిల్‌గా వినియోగదారులు పొందేవిధంగా ఇందులో 120 చిన్న షెడ్లను ఏర్పాటు చేశారు. నిర్మాణ బాధ్యతలు ప్రజారోగ్యశాఖ నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు 80 శాతం మేర పనులు పూర్తయ్యాయి. 2023లోనే వినియోగంలోకి తేవాలనే ఉద్దేశంతో పురపాలక శాఖ మాజీ మంత్రి కేటీఆర్ గత అక్టోబరు 3న సమీకృత మార్కెట్‌ను ప్రారంభించారు. 3 నెలలు గడిచినా ఇప్పటి వరకూ వినియోగదారులకు మార్కెట్ సేవలు కల్పించలేకపోయారు.

నిలిచిపోయిన పనులు..

సమీకృత మార్కెట్‌లో ఇంకా చాలా పనులు మిగిలి ఉన్నాయి. పార్కింగ్ టైల్స్, చుట్టూ ప్రహరీ నిర్మించాల్సి ఉంది. షెడ్డు చుట్టూ ప్రస్తుతం రేకులు అడ్డుగా నిలిపారు. డ్రైనేజీ వ్యవస్థ, మూత్రశాలలు ఇతరత్రా సౌకర్యాలు సమకూర్చాల్సి ఉంది. రైతులు సేదతీరేందుకు సదుపాయం, షెడ్లలో విద్యుత్తు సౌకర్యం తదితర పనులన్నీ మిగిలిపోయాయి. మూడు నెలలుగా మార్కెట్‌లో ఎలాంటి పనులు కొనసాగడంలేదు. ప్రస్తుతం ప్రజారోగ్యశాఖ ఆధీనంలో ఉన్న మార్కెట్ పురపాలక సంఘానికి అప్పగించాల్సి ఉంది. వ్యాపారులకు షెడ్లను కేటాయించకపోవడంతో వారిలో సందిగ్ధం నెలకొంది.

లక్ష్యం నెరవేరేనా!



పండ్లు, పూలు, కూరగాయలు, మాంసం, చేపలు అన్ని రకాల ఉత్పత్తులు ఒకేచోట వినియోగదారులకు అందించే ఉద్దేశం మంచిదే అయినా పట్టణవాసులు ఏ మేరకు సేవలు వినియోగించుకుంటారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలో ఇప్పటికే గడియారం మార్కెట్, పాతబస్టాండ్ ఇందిర మార్కెట్, రైతుబజార్, అంగడిబజార్, నటరాజ్ చౌరస్తా ప్రాంతాల్లో మార్కెట్లు కొనసాగుతున్నాయి. ఇవికాకుండా పలు ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లలోనూ రైతులు తమ ఉత్పత్తులు విక్రయిస్తున్నారు. గడిచిన పదేళ్లలో పట్టణం నలువైపులా విస్తరించింది. ఈ క్రమంలో చిన్న మార్కెట్లు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 1.20 లక్షల జనాభా ఉన్న పట్టణంలో అందరూ సమీకృత మార్కెట్‌కు రావాలనే ప్రభుత్వ సంకల్పం ఏ మేరకు సఫలీకృతం కానుందో వేచిచూడాలి.

## అమ్మలకేదీ ఆర్థిక భరోస

పెద్దపల్లి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు గత ప్రభుత్వం 'కేసీఆర్ కిట్' పేరిట ఆర్థిక ప్రోత్సాహకాలు అందించింది. సర్కారు దవాఖానాలో వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు అక్కడే పురుడు పోసుకున్న వారికి సామగ్రితో కూడిన కిట్, ఆడబిడ్డ జన్మిస్తే రూ.13 వేలు, మగ బిడ్డ అయితే రూ.12 వేల నగదును పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పేరును ఎంసీహెచ్(మెటర్నల్ అండ్ చైల్డ్ హెల్త్)గా మార్చారు. అయితే రెండేళ్లుగా నగదు ప్రోత్సాహకాల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. ఆర్థిక చేయూతనిస్తుందని ఆశించిన పేదలకు నిరాశే మిగులుతోంది.

నాలుగు విడతలుగా పంపిణీ

గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకుంటే కిట్‌తో పాటు నాలుగు విడతలుగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. మొదటి దశలో గర్భిణికి అయిదో నెలలోపు రూ.3 వేలు బ్యాంకు ఖాతాలో జమ అవుతాయి. రెండో దశలో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగితే కిట్ అందించి మగబిడ్డ జన్మిస్తే రూ.4 వేలు, ఆడబిడ్డ అయితే రూ.5 వేలు పంపిణీ చేస్తారు. మూడో దశలో పుట్టిన పిల్లలకు 45 రోజులలోపు



టీకా, మూడున్నర నెలల వరకు మూడు సార్లు టీకా వేసుకుంటే రూ.2 వేలు, నాలుగో దశలో తొమ్మిది నెలలకు గడువులోగా టీకా వేసుకుంటే రూ.3 వేలు విడుదల చేస్తారు.

9,255 మంది నిరీక్షణ

జిల్లా ప్రధాన ఆసుపత్రి, గోదావరిఖని, మంథని, సుల్తానాబాద్ ఆసుపత్రులతో పాటు 18 గ్రామీణ, 6 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 104 ఉపకేంద్రాల ద్వారా ప్రభుత్వ వైద్య సేవలు అందుతున్నాయి. వీటిపై పల్లెలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్ కిట్ అమలులోకి వచ్చాక ప్రైవేటులో కంటే ప్రభుత్వ దవాఖానాల్లోనే ఏటికేడు ప్రసవాలు పెరుగుతున్నాయి. నగదు పంపిణీలో పారదర్శకత పాటించేందుకు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తున్నారు. కాగా ప్రోత్సాహకాల కోసం రెండేళ్లుగా 9,255 మంది లబ్ధిదారులు నిరీక్షిస్తున్నారు. కిట్లు కూడా సక్రమంగా రావడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో వచ్చిన కిట్లపై పేరు తొలగించి పంపిణీ చేస్తున్నారు.

రెండేళ్లుగా జిల్లాలో ప్రసవాలు

2022–23 : 6,418

2023–24 : 2,837

నిధుల మంజూరుకు నివేదిస్తున్నాం

జిల్లాలో సర్కారు ఆసుపత్రుల్లో కాన్పు జరిగిన బాలింతలకు నగదు ప్రోత్సాహాన్ని ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ కానున్నాయి. నిధుల మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తున్నాం.ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి

## సీసీఐకే రైతుల మద్దతు

జగిత్యాల :ప్రైవేట్ వ్యాపారులు పత్తిని మద్దతు ధరకు ఖరీదు చేయకపోవటంతో రైతులు సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)కు అధిక మొత్తంలో పత్తిని విక్రయిస్తున్నారు. ప్రస్తుత సీజన్ ఆరంభంలో ప్రైవేట్ వ్యాపారులు కొద్దిమేర పత్తిని ఖరీదు చేసినా.. మూడు నెలలుగా ఉమ్మడి జిల్లాలో ప్రైవేట్ వ్యాపారులు మద్దతు ధరకు ఖరీదు చేయటం లేదు. గత నవంబర్ నుంచి ప్రధాన వ్యవసాయ మార్కెట్లు, ఆయా ప్రాంతాల్లో ఒప్పందం చేసుకున్న జిన్నింగ్ మిల్లుల్లోని కొనుగోలు కేంద్రాల్లో సీసీఐ మద్దతు ధరకు పత్తి కొనుగోళ్లు చేపట్టింది. ప్రస్తుత సీజన్‌లో కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గోపాలరావుపేటలో ప్రైవేట్ వ్యాపారులు 65,387 క్వింటాళ్ల పత్తిని ప్రైవేట్ వ్యాపారులు ఖరీదు చేయగా, సీసీఐ 1,10,334 క్వింటాళ్ల పత్తిని ఖరీదు చేసింది. 20 రోజులకు పైగా యార్డు కంటే సీసీఐ అధిక మొత్తంలో పత్తిని ఖరీదు చేస్తూ వస్తోందని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి జి.రెడ్డినాయక్ తెలిపారు.

నాడు రూ.14 వేలు.. నేడు రూ.6,920

అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధార పడే పత్తి ధర క్రమేణా పడిపోతూ



వస్తోంది. 2021–22లో జమ్మికుంట మార్కెట్‌లో క్వింటా పత్తి రికార్డు స్థాయిలో రూ.14 వేల ధర పలికింది. 2022లో రూ.9,100కు పడిపోయింది. గత నవంబర్‌లో రూ.7,600 పలకగా, తాజాగా రూ.6,920కు ఇరవై రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఖరీదు చేస్తున్నారు. మొదట్లో సీసీఐ మద్దతు ధర రూ.7,020కు ఖరీదు చేసినా.. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, పత్తి గింజల ధర తగ్గుదల, అధిక తేమ, నాణ్యత లేకపోవటం తదితర కారణాలతో ధర తగ్గింది.

మిల్లుల్లో పేరుకుపోతున్న నిల్వలు

పత్తిని జిన్నింగ్ చేసి పత్తి గింజలను వేరు చేస్తారు. ఈ గింజల ధర రూ.2,950 నుంచి రూ.2,500 తగ్గింది. దీంతో జిన్నింగ్ మిల్లుల్లో పత్తి గింజల నిల్వలు పేరుకుపోయాయి. పత్తి గింజలను హరియాణా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, జమ్మూకశ్మీర్ తదితర ప్రాంతాలకు విక్రయిస్తామని.. ప్రస్తుతం డిమాండ్ లేక ధర తగ్గడంతో మిల్లుల్లోనే నిల్వ చేశామని వ్యాపారులు పేర్కొంటున్నారు. దూది బేళ్లను 99 శాతం తమిళనాడుకు విక్రయిస్తామని, ధరలు పరిశీలించి రవాణా చేస్తామని చెబుతున్నారు.

# ఆర్థిక చేయూతకు చేతివాటం

సిరిసిల్ల: నగరంలోని ఓ ప్రాంతంలో బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే రూ.లక్ష రుణానికి దరఖాస్తు చేసుకోగా ఇటీవల ఒక బిల్ కలెక్టర్ విచారణకు వెళ్లారు. ఆ సమయంలో వివరాలన్నీ నమోదు చేసుకొని రూ.5 వేలు ఇవ్వాలని కోరడంతో రూ.3 వేలు చేతిలో పెట్టారు. రుణం మాత్రం గ్యారెంటీగా వస్తుందని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు. మరో ప్రాంతంలో ఓ డివిజన్ స్థాయి నాయకుడు చెప్పిన పేర్లకు కచ్చితంగా రుణం వచ్చేలా విచారణలో రాయాలని ఒత్తిడి తెచ్చారు. తీరా ఆరా తీస్తే అందినంత వసూలు చేసినట్లుగా ప్రచారం జరుగుతుంది.రాష్ట్ర ప్రభుత్వం బీసీ కుల వృత్తిదారులకు ఆర్థికంగా చేయూత ఇవ్వడానికి వెనుకబడిన వర్గాల్లోని 14 కుల వృత్తిదారులతోపాటు ఎంబీసీలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారికి రూ.లక్ష రుణం అందజేసేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఆన్‌లైన్ దరఖాస్తు సమయంలో కుల ధ్రువీకరణతోపాటు ఆదాయ పత్రాలు జత చేశారు. ఈ గడువు జూన్ 20తో ముగియగా ఐదారు రోజులుగా క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభమైంది. అర్హులను నిర్ధారించి పంపించాల్సి ఉండటంతో పైరవీల జాతర మొదలైంది. జిల్లా వ్యాప్తంగా 19,905 మంది దరఖాస్తు చేసుకున్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థతోపాటు నాలుగు పురపాలికల పరిధిలో 4,516 మంది ఉన్నారు.

ముట్టజెబితేనే విచారణ

కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో అత్యధికంగా రూ.లక్ష రుణానికి దరఖాస్తులు వచ్చాయి. 60 డివిజన్లకు కలిపి మూడు వేల మందికిపైగా



దరఖాస్తు చేసుకోగా వీటిని బిల్ కలెక్టర్ల ద్వారా విచారణ ప్రారంభించారు. సందట్లో సడేమియా అన్నట్లుగా కొందరు కార్పొరేటర్ల అనుచరులు, పైరవీకారులు, కొందరు బిల్ కలెక్టర్లు చేతి వాటానికి తెరలేపారు. బిల్ కలెక్టర్ల దగ్గర ఉన్న జాబితాల్లోని పేర్ల ఆధారంగా విచారణ చేస్తుండగా ఆ సమయంలో దరఖాస్తుదారుడి స్తోమతను బట్టి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూళ్లకు తెరలేపారు. రూ.లక్షకు ఐదు శాతం ఇవ్వాలని, రుణం పక్కాగా వస్తుందని చెబుతూ వసూళ్లకు పాల్పడుతున్నట్లు బహిరంగంగానే చర్చ జరుగుతోంది. కొందరు వార్డు, డివిజన్ స్థాయి నాయకులు కూడా బిల్ కలెక్టర్లపై ఒత్తిడి తెస్తూ విచారణలో అనుకూలంగా రాయాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు సమాచారం.

చరవాణులతోనే వివరాలు

బీసీ రుణాల కోసం విచారణ చేస్తుండగా దరఖాస్తుదారుడి ఇంటికి వెళ్లి ఆర్థిక స్థితిగతులు పూర్తి స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. కొందరు బిల్ కలెక్టర్లు క్షేత్రస్థాయికి వెళ్లకుండా చరవాణులతో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. రాత్రి 8.30 గంటల వరకు ఫోన్లు చేస్తూ వివరాలను నమోదు చేసుకుంటున్నట్లు దరఖాస్తుదారులే చెబుతున్నారు. స్థానికంగా లేకపోతే ముప్పుతిప్పలు పెడుతున్నట్లు విమర్శలున్నాయి.

బిల్ కలెక్టర్లతో కాకుండా..

అర్హులకు లబ్ధి చేకూరాలంటే వచ్చిన దరఖాస్తులను బల్దియా బిల్ కలెక్టర్లతోనే కాకుండా ఇతర శాఖల ఉద్యోగుల ద్వారా విచారణ జరిపితే మేలు జరిగే అవకాశముంది. వీరికి ఆయా డివిజన్ల ప్రజాప్రతినిధులు పరిచయం ఉండదు. వెంటనే విచారణ పూర్తి చేసే అవకాశముంటుంది. ఉన్నది ఉన్నట్టుగా విచారణ చేపట్టిన సదరు మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది ఉనికిపై ప్రమాదం ఏర్పడుతుందనే అభిప్రాయముంది. కొన్ని డివిజన్లలో ఇబ్బందులు కూడా తప్పడం లేదు. ఇతర విభాగాల సిబ్బందితో విచారణ చేయిస్తే వీధుల్లో రాజకీయంగా ఒత్తిడి తగ్గుతుందని అంటున్నారు. సంబంధిత అధికారి దృష్టికి తీసుకెళ్లగా బిల్ కలెక్టర్లు ఎలాంటి డబ్బులు అడగడంలేదని, ఇప్పటివరకు ఫిర్యాదులు కూడా తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు.


## ఇక పక్కాగా రేషన్ బియ్యం లెక్క!

హుజూరాబాద్: ఇక నుంచి రేషన్ డీలర్లకు తరుగు కష్టాలు తీరనున్నాయి. ప్రజా పంపిణీలో అమలు చేసే సాంకేతికతను ఎంఎల్ఎస్ కేంద్రాల్లోనూ అమలు చేయనున్నారు. ఈ నెల నుంచే రేషన్ డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. అయిదు నెలల క్రితమే ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక సమస్యతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు బయోమెట్రిక్ అమలుతో ఉమ్మడి జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రతినెలా మండల స్థాయి గిడ్డంగులకు వెళ్లి తమ దుకాణంలోని కార్డుల ఆధారంగా కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది.

తీరనున్న తరుగు కష్టాలు ఉమ్మడి జిల్లాలోని 14 ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి 1,964 రేషన్ దుకాణాలకు నెలనెలా బియ్యం సరఫరా అవుతుంది. ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటుందని స్టాక్ పాయింట్ అధికారులు చెబుతుండగా.. తమ దుకాణాలకు వచ్చేసరికి ప్రతీ బస్తాలో నాలుగైదు కిలోలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దాదాపు 30 శాతం గన్నీ సంచులు నాణ్యత కొరవడి చిల్లులు పడటం వల్లే తరుగు వస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. బియ్యం తక్కువ వస్తున్న విషయాన్ని గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలోని రేషన్ డీలర్లు పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్షించిన కమిషనర్ గత ఫిబ్రవరి నుంచి కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం ఇచ్చేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ప్రయోగాత్మకంగా మండలానికి అయిదారుగురు డీలర్లకు బయోమెట్రిక్ విధానంతో బియ్యం ఇవ్వాలని ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిపివేశారు. సాంకేతిక సమస్యను సవరించి ఈ నెల నుంచే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దుకాణాల వద్ద లబ్ధిదారులు వేలిముద్ర వేసినప్పుడు ఈ-పాస్‌కు వేయింగ్ యంత్రాన్ని ఎలా అనుసంధానం చేస్తారో అదే విధానాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వద్ద డీలర్ల వేలిముద్రలతో బియ్యం అందజేయనున్నారు. ఈ విధానంతో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయానికి డీలర్లకు సరఫరా చేసిన బియ్యం లెక్కలు ఈ-పాస్ ద్వారా కచ్చితంగా నమోదయ్యే అవకాశం ఉంది.గన్నీ సంచి తిరకాసుతో ఆలస్యం

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 9,79,920 కార్డులు ఉండగా.. కేంద్రం కోటా కింద 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో.. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ చేసేలా ఈ నెలలో 18,043.735 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించారు. కానీ 600 గ్రాములు ఉండే గన్నీ సంచి బరువు తీయకుండానే బియ్యం ఇస్తే తాము నష్టపోతామని డీలర్లు వాపోతున్నారు.

# వ్యాధుల కాలం.. జ్వరాల విజృంభణకు ఆస్కారం



సిరిసిల్ల: వ్యాధుల కాలం ప్రవేశించింది. భారీ వర్షాలు కురవకపోయినా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మలేరియా, డెంగీ, విష జ్వరాలే కాక కలుషిత నీటితో వాంతులు, విరేచనాలు, కామెర్లు, టైఫాయిడ్ తదితర వ్యాధులూ విజృంభించే అవకాశాలున్నాయి. గతేడాది జిల్లా వ్యాప్తంగా 50 డెంగీ, ఒక మలేరియా కేసు నమోదవగా, ఈసారి ఇప్పటికీ నమోదు కాలేదు. వర్షాలు ఎక్కువైతే వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వైద్య ఆరోగ్య శాఖ అంచనా వేస్తోంది. వ్యాధుల ముప్పును తప్పించేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై సిబ్బందిని అప్రమత్తం చేస్తోంది. జిల్లాలో కాలానుగుణ వ్యాధుల బెడద ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ముందుగానే వైద్య ఆరోగ్యశాఖ గుర్తించింది. ఇక్కడ పారిశుద్ధ్య సమస్యతో తరచూ వ్యాధులు వ్యాపించే అవకాశాలున్నాయి. వేములవాడ మండలం అనుపురం, చీర్లవంచ ఆర్అండ్ఆర్ కాలనీ, శాత్రాజుపల్లి, వేములవాడ గ్రామీణ మండలం వట్టెంల, కోనరావుపేట మండలం కనగర్తి, ఎల్లారెడ్డిపేట మండలంలోని ఎల్లారెడ్డిపేట, రంగంపేట, హరిదాస్‌నగర్, ఇల్లంతకుంటలో తాళ్లపల్లి, తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్, తంగళ్లపల్లి, చంద్రంపేట, మండెపల్లి, ముస్తాబాద్ మండలం కొండాపూర్, వేములవాడ, సిరిసిల్ల పట్టణాల్లో ప్రగతినగర్, శాంతినగర్, భగవంతరావునగర్‌లు ఉన్నాయి. మొత్తంగా 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 15 గ్రామాలు, మూడు వార్డులను గుర్తించారు. ఇక్కడ ముందస్తుగా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య, ఆరోగ్య కమిటీలతో సమావేశాలు నిర్వహించి అప్రమత్తం చేశారు. కాలానుగుణ వ్యాధులు విజృంభిస్తే పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తొమ్మిది మంది సభ్యులతో రాపిడ్ యాక్షన్ బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వ్యాధులు అదుపులోకి వచ్చేవరకు ఈ బృందం నిరంతరం పర్యవేక్షిస్తుంది.

అన్‌టైడ్ నిధులేవీ?

పంచాయతీల్లో తాగునీటి పథకాల ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాల్సి ఉంది. అలాగే వర్షం నీరు వీధులు, మురుగు కాల్వల్లో సాఫీగా వెళ్లేలా చూడాలి. ఇందుకు వైద్య ఆరోగ్యశాఖకు జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రతి పంచాయతీకి అన్‌టైడ్ నిధులను వర్షాకాలం ప్రారంభం జూన్‌లోనే కేటాయిస్తోంది. ఈసారి ఇప్పటికీ రాలేదు. ఒక్కో పంచాయతీకి రూ.5 వేల చొప్పున ఏటా రూ. 10.55 లక్షలు కేటాయిస్తారు. కానీ కొత్త పంచాయతీలను జాతీయ ఆరోగ్య మిషన్ పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు జిల్లాలో 211 ఉన్న పంచాయతీలు 255కు చేరాయి. నిధులు మాత్రం పాత పంచాయతీల ప్రకారమే విడుదల చేస్తోంది. వీటిని ఆయా పంచాయతీలకు సర్దుబాటు చేస్తున్నారు.

నీటి శుద్ధి.. దోమల నివారణ

జిల్లాలోని బోయినపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో ఇటీవల పచ్చకామెర్ల వ్యాధితో చికిత్స పొందిన వారు ఎక్కువగా ఉన్నారు. ఈ వ్యాధి ఎక్కువగా వర్షాకాలంలో కలుషిత నీరు తాగడంతో వస్తుంది. ఏప్రిల్, మే నెలల్లో ఈ వ్యాధితో చికిత్స పొందారు. దీనిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆయా గ్రామాల్లో నీటి నమూనాలు సేకరించి నాణ్యత పరీక్షలు చేయించారు. రాజరాజేశ్వర జలాశయం వెనక జలాల సమీపంలోని గ్రామాల్లో ఈ వ్యాధి లక్షణాలు తరచూ కనిపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఇళ్ల సమీపంలో నీటి నిల్వలు పేరుకుపోతున్నాయి. వీటితో దోమలు విపరీతంగా పెరుగుతున్నాయి. వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

నివారణ చర్యలు చేపడుతున్నాం

జిల్లాలో ఇప్పటి వరకు పరిస్థితి అదుపులోనే ఉంది. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. మంగళ, శుక్రవారాలు డ్రై డేలుగా పాటించేలా సిబ్బందికి సూచనలు ఇచ్చాం. పంచాయతీ, పురపాలక శాఖలు మురుగు గుంతలు, కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయించాలి. అబెట్ ద్రావణం పిచికారీ చేయించాలి. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నాం. శ్రీరాములు, జిల్లా కాలానుగుణ వ్యాధుల నియంత్రణ అధికారి

# పల్లె చెంతకే మెరుగైన వైద్యం




సిరిసిల్ల: గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలకు అందుబాటులో ఉచిత వైద్యం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో అన్ని రకాల టీకాలు, వివిధ పరీక్షలను నిర్వహించి, ఫలితాలు అందించే యంత్రాలతోపాటు రక్తకణాలు(సెల్ కౌంట్) లెక్కించే యంత్రాలను ఏర్పాటు చేశారు. దీనికి తోడు ప్రస్తుతం ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా ఉప కేంద్రాల పరిధిలోనూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించేందుకు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్ వంటి రోగాలను పరీక్షించేందుకు పరికరాలను సిబ్బందికి అందించారు. దీనిద్వారా గ్రామంలోనే అన్ని రకాల వైద్య సేవలందే అవకాశం ఏర్పడింది. జిల్లా వ్యాప్తంగా అయిదు పట్టణ, 19 పీహెచ్‌సీలు ఉండగా, 151 ఆరోగ్య ఉప కేంద్రాలు కొనసాగుతున్నాయి. ఇందులో 24 గంటలు రోగులకు సేవలందించేందుకు సారంగాపూర్, ఇబ్రహీంపట్నం, రాయికల్, మల్లాపూర్, కథలాపూర్, కొడిమ్యాల, మల్యాల, పెగడపల్లి, ధర్మపురి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. జిల్లాలోని 151 ఆరోగ్య ఉప కేంద్రాలను పల్లె దవాఖానాలుగా మార్పు చేసి వైద్యులను, 'మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్' (ఎంఎల్‌హెచ్‌పీ)లను నియమించారు. ఆయా కేంద్రాల పరిధిలో ప్రస్తుతం 299 రక్తపోటు, మధుమేహం పరీక్షించే పరికరాలను అందించారు.

పేదలందరికీ..

ప్రభుత్వం పట్టణాల్లో బస్తీ దవాఖానాలను నెలకొల్పగా, పల్లెల్లోనూ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు పల్లె దవాఖానాలను తీసుకువచ్చింది. ప్రాథమిక స్థాయిలోనే నిరుపేదలకు వైద్యం అందించాలన్న లక్ష్యంతో పల్లె దవాఖానాలు పనిచేస్తున్నాయి. ఇందులో భాగంగానే దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రతినెల పరీక్షలు నిర్వహించేందుకు(రక్తపోటు, మధుమేహం) పరికరాలను అందించారు. వీటి ద్వారా గ్రామాల్లో ఉప కేంద్రానికి రాలేని వారిని గుర్తించి వారి ఇంటికి వెళ్లి పరీక్షలు చేయనున్నారు. క్యాన్సర్‌లోని మూడు రకాలపై అవగాహన కల్పించడమే కాకుండా ప్రాథమికంగా లక్షణాలతో ఉన్న అనుమానితుల్ని సిబ్బంది గుర్తించి వైద్యులకు సిఫారసు చేస్తారు. గుట్కా, బీడీ, మద్యం సేవిస్తే వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామంలో అవగాహన కల్పిస్తారు. మంచానికే పరిమితమైన వారిని గుర్తించి ఇంటికి వెళ్లి మందులు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా దవాఖానాల్లో ప్రస్తుతం సాధారణ ఓపీ, గర్భిణులకు పరీక్షలు, చిన్నపిల్లలకు టీకాలు, అసాంక్రమిక వ్యాధుల నిర్ధారణ, మందుల పంపిణీ సేవలు అందుతున్నాయి. అవసరమైన వ్యాధి నిర్ధారణ పరీక్షలను రక్త, మూత్ర నమూనాలను సేకరించి, సమీపంలోని తెలంగాణ డయాగ్నోస్టిక్స్ కేంద్రానికి పంపించి ఫలితాలు అందిస్తున్నారు.

దీర్ఘకాలిక రోగుల వద్దకు..

ప్రభుత్వం పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటుంది. కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందుతున్నందున ప్రభుత్వ ఆస్పత్రులను సద్వినియోగం చేసుకోవాలని, వివిధ రకాల రక్త పరీక్షలను అందుబాటులో చేయడమే కాకుండా ఫలితాలు అందిస్తున్నాం. ఆరోగ్య కేంద్రాలతోపాటు ఉప కేంద్రాల పరిధిలో దీర్ఘకాలిక రోగులు రాలేని పరిస్థితి ఉంటే సిబ్బంది అక్కడికి వెళ్లి పరీక్షలు నిర్వహించనున్నారు.

షమీయోద్దిన్, జిల్లా ఎన్‌సీడీ, వెల్‌నెస్ సెంటర్ ప్రోగ్రాం అధికారి

# పొద్దంతా ఒడ్డుకు.. రాత్రయితే పట్టణాలకు

హుజూరాబాద్: గోదావరి తీరం నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలింపు కొనసాగుతూనే ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు ఎస్సారెస్పీ నిండడంతో వరద నీరు వదలడంతో గోదావరిలో ఇసుక మేటలు ఎక్కువయ్యాయి. జగిత్యాల జిల్లా పరిధిలోని బీర్‌పూర్, ధర్మపురి, మల్లాపూర్, రాయికల్ మండలాల్లో గోదావరి నదీ ప్రవాహం కొనసాగుతుంది. ఆయా మండలాల్లోని గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని నదీ తీర ప్రాంతం నుంచే కాకుండా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల మీదుగా జగిత్యాల పట్టణానికి యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతుంది. రోజంతా స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇసుకను నదీ ఒడ్డుకు చేర్చి సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు.

రీచ్‌ల ఏర్పాటులో జాప్యం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రంగసాగర్ మీదుగా గోదావరి ప్రవాహం కొనసాగుతుంది. ఏటా గోదావరి తీరం వెంట అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుంటారు. బీర్‌పూర్ మండలంలో చిన్నకొల్వాయి, రేకులపల్లె, చిత్రవేణిగూడెం ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అనువుగా ఉంటాయని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ రీచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుకంతా తరలిపోయింది. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైనందున రీచ్‌లను ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది.

ఇతరులు వెళితే అభ్యంతరమే!మండలంలోని గోదావరి తీరం వెంట గ్రామాలు మినహా ఇతర గ్రామాల వారు ఇసుకను తీసుకువచ్చేందుకు వెళితే అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అధికారులకు చెప్పి జరిమానా విధించేలా చూస్తారు. గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల వారి అనుమతి తీసుకుంటేనే ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకునే వీలుంటుంది. దీనిద్వారా ట్రాక్టర్ యజమానులు గృహ అవసరాలకు ఒక్కో ట్రిప్పుకు రూ.3 నుంచి రూ.4 వేలు వరకు కాగా, టిప్పరు రూ.20 నుంచి రూ.30 వేలకు పైగానే తీసుకుంటున్నారు. ఎక్కడైనా అడ్డుకుంటే అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు.

# ఇక పక్కాగా రేషన్ బియ్యం లెక్క!

హుజూరాబాద్: ఇక నుంచి రేషన్ డీలర్లకు తరుగు కష్టాలు తీరనున్నాయి. ప్రజా పంపిణీలో అమలు చేసే సాంకేతికతను ఎంఎల్ఎస్ కేంద్రాల్లోనూ అమలు చేయనున్నారు. ఈ నెల నుంచే రేషన్ డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయించేలా అవసరమైన చర్యలు చేపట్టారు. అయిదు నెలల క్రితమే ఈ విధానాన్ని అమలు చేయాలని భావించినా సాంకేతిక సమస్యతో జాప్యం జరిగింది. ఎట్టకేలకు బయోమెట్రిక్ అమలుతో ఉమ్మడి జిల్లాలోని రేషన్ డీలర్లు ప్రతినెలా మండల స్థాయి గిడ్డంగులకు వెళ్లి తమ దుకాణంలోని కార్డుల ఆధారంగా కచ్చితమైన తూకంతో బియ్యం తీసుకోవాల్సి ఉంటుంది.

తీరనున్న తరుగు కష్టాలు

ఉమ్మడి జిల్లాలోని 14 ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి 1,964 రేషన్ దుకాణాలకు నెలనెలా బియ్యం సరఫరా అవుతుంది. ఒక్కో బస్తాలో 50 కిలోల బియ్యం ఉంటుందని స్టాక్ పాయింట్ అధికారులు చెబుతుండగా.. తమ దుకాణాలకు వచ్చేసరికి ప్రతీ బస్తాలో నాలుగైదు కిలోలు తక్కువగా వస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. దాదాపు 30 శాతం గన్నీ సంచులు నాణ్యత కొరవడి చిల్లులు పడటం వల్లే తరుగు వస్తుండటంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని చెబుతున్నారు. బియ్యం తక్కువ వస్తున్న విషయాన్ని గతేడాది డిసెంబర్‌లో రాష్ట్రంలోని రేషన్ డీలర్లు పౌరసరఫరాల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై సమీక్షించిన కమిషనర్ గత ఫిబ్రవరి నుంచి కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం ఇచ్చేలా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ప్రయోగాత్మకంగా మండలానికి అయిదారుగురు డీలర్లకు బయోమెట్రిక్ విధానంతో బియ్యం ఇవ్వాలని ప్రయత్నించినా సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నిలిపివేశారు. సాంకేతిక సమస్యను సవరించి ఈ నెల నుంచే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దుకాణాల వద్ద లబ్ధిదారులు వేలిముద్ర వేసినప్పుడు ఈ-పాస్‌కు వేయింగ్ యంత్రాన్ని ఎలా అనుసంధానం చేస్తారో అదే విధానాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల వద్ద డీలర్ల వేలిముద్రలతో బియ్యం అందజేయనున్నారు. ఈ విధానంతో ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల నుంచి జిల్లా కేంద్రాలకు, అక్కడి నుంచి పౌరసరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయానికి డీలర్లకు సరఫరా చేసిన బియ్యం లెక్కలు ఈ-పాస్ ద్వారా కచ్చితంగా నమోదయ్యే అవకాశం ఉంది.

గన్నీ సంచి తిరకాసుతో ఆలస్యం

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో 9,79,920 కార్డులు ఉండగా.. కేంద్రం కోటా కింద 5 కిలోలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా ఒక కిలో.. ప్రతీ యూనిట్‌కు ఆరు కిలోల చొప్పున పంపిణీ చేసేలా ఈ నెలలో 18,043.735 మెట్రిక్ టన్నుల బియ్యం కోటా కేటాయించారు. కానీ 600 గ్రాములు ఉండే గన్నీ సంచి బరువు తీయకుండానే బియ్యం ఇస్తే తాము నష్టపోతామని డీలర్లు వాపోతున్నారు. అందుకే ప్రతి నెలా 26వ తేదీ నుంచి గోదాముల నుంచి రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా కావాల్సి ఉండగా ఉమ్మడి జిల్లాలోని చాలామంది డీలర్లు సోమవారం వరకూ తీసుకోలేదు. గన్నీ సంచి బరువు తీసివేసి బియ్యం ఇవ్వాలని పౌరసరఫరాల శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించారని, నుంచి బియ్యం తీసుకుంటామని డీలర్లు చెబుతున్నారు. ప్రతినెలా 5వ తేదీ నుంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానం అమలు చేస్తుండటంతో ఇకపై ప్రతినెలా 7వ తేదీ నుంచి బియ్యం పంపిణీ ప్రారంభించాలని పౌరసరఫరాల శాఖ ఆదేశించింది.

కచ్చితమైన తూకంతో బియ్యం సరఫరాగత ఫిబ్రవరిలో డీలర్లకు బయోమెట్రిక్ ద్వారా బియ్యం ఇవ్వాలని భావించినా సాంకేతిక సమస్యతో అమలు చేయలేదు. ఈ నెల నుంచి ప్రతీ డీలర్‌కు బయోమెట్రిక్ ద్వారానే బియ్యం ఇచ్చేలా ఏర్పాట్లు చేశాం. గతంలో బియ్యం తరుగు వస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చేవి. ఇక నుంచి అలాంటి సమస్య ఉండదు. కార్డులు, యూనిట్ల ఆధారంగా ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా కచ్చితమైన తూకంతో డీలర్లకు బియ్యం సరఫరా అవుతుంది. నిబంధనలకు అనుగుణంగానే బియ్యం ఇవ్వాలని గోదాం అధికారులకు సూచించాం. శ్రీకాంత్‌రెడ్డి, డీఎం, పౌర సరఫరాల సంస్థ, కరీంనగర్

## పొద్దంతా ఒడ్డుకు.. రాత్రయితే పట్టణాలకు

సారంగాపూర్: గోదావరి తీరం నుంచి నిత్యం అక్రమంగా ఇసుక తరలింపు కొనసాగుతూనే ఉంది. సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు ఎస్సారెస్పీ నిండడంతో వరద నీరు వదలడంతో గోదావరిలో ఇసుక మేటలు ఎక్కువయ్యాయి. జగిత్యాల జిల్లా పరిధిలోని బీర్‌పూర్, ధర్మపురి, మల్లాపూర్, రాయికల్ మండలాల్లో గోదావరి నదీ ప్రవాహం కొనసాగుతుంది. ఆయా మండలాల్లోని గోదావరి తీరం నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. బీర్‌పూర్ మండలంలోని నదీ తీర ప్రాంతం నుంచే కాకుండా ధర్మపురి మండలంలోని పలు గ్రామాల నుంచి బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల మీదుగా జగిత్యాల పట్టణానికి యథేచ్ఛగా టిప్పర్ల ద్వారా ఇసుక దందా కొనసాగుతుంది. రోజంతా స్థానిక ట్రాక్టర్ యజమానులు ఇసుకను నదీ ఒడ్డుకు చేర్చి సాయంత్రం నుంచి తెల్లవారుజాము వరకు టిప్పర్ల ద్వారా జగిత్యాలకు తరలిస్తున్నారు.

రీచ్‌ల ఏర్పాటులో జాప్యం బీర్‌పూర్ మండలంలోని చిన్నకొల్వాయి, చిత్రవేణిగూడెం, కమ్మునూర్, మంగెళ, రంగసాగర్ మీదుగా గోదావరి ప్రవాహం కొనసాగుతుంది. ఏటా గోదావరి తీరం వెంట అనువైన ఇసుక రీచ్‌లను గుర్తించాలని ఉన్నతాధికారులు ఆదేశిస్తుంటారు. బీర్‌పూర్ మండలంలో చిన్నకొల్వాయి, రేకులపల్లె, చిత్రవేణిగూడెం ప్రాంతంలో ఇసుక రీచ్‌లు అనువుగా ఉంటాయని ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురిసినప్పటికీ రీచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ఇసుకంతా తరలిపోయింది. మళ్లీ వర్షాకాలం ప్రారంభమైనందున రీచ్‌లను ఏర్పాటు చేసినట్లయితే ప్రభుత్వానికి ఆదాయం సమకూరడమే కాకుండా నిబంధనలకు అనుగుణంగా ఇసుకను తరలించే అవకాశం ఉంటుంది.

ఇతరులు వెళితే అభ్యంతరమే!మండలంలోని గోదావరి తీరం వెంట గ్రామాలు మినహా ఇతర గ్రామాల వారు ఇసుకను తీసుకువచ్చేందుకు వెళితే అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా అధికారులకు చెప్పి జరిమానా విధించేలా చూస్తారు. గోదావరి తీరం వెంట ఉన్న గ్రామాల వారి అనుమతి తీసుకుంటేనే ఇతర గ్రామాలకు చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తీసుకునే వీలుంటుంది. దీనిద్వారా ట్రాక్టర్ యజమానులు గృహ అవసరాలకు ఒక్కో ట్రిప్పుకు రూ.3 నుంచి రూ.4 వేలు వరకు కాగా, టిప్పరు రూ.20 నుంచి రూ.30 వేలకు పైగానే తీసుకుంటున్నారు. ఎక్కడైనా అడ్డుకుంటే అప్పటికప్పుడు సెటిల్‌మెంట్ చేసుకుని ఇసుకను తరలిస్తున్నారు. గోదావరి తీరం వెంట దంపుల కొద్ది ఇసుక ఉన్నప్పటికీ ఏనాడు అధికారులు సీజ్ చేయకపోవడంతో దందా నిరంతరంగా కొనసాగుతుంది. అప్పుడప్పుడు పోలీసులు, రెవెన్యూ అధికారులు ట్రాక్టర్లను పట్టుకుని సీజ్ చేస్తున్నప్పటికీ మైనింగ్ అధికారుల జాడ కనపడడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణానికి తరలుతున్న ఇసుక టిప్పర్‌ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకుడుబీర్‌పూర్ మండలంలో ఎలాంటి ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయలేదు.




## అధికారం కోసం షర్మిలను కూడా చంపేస్తారేమో...

విశాఖపట్నం, జనవరి 30: ప్రతి రోజు ఏదో ఒక అంశాన్ని ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి జగన్‌పై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల విరుచుకుపడుతున్న విషయం తెలిసిందే. జగన్‌కు వ్యతిరేకంగా షర్మిల మాట్లాడటం ప్రస్తుతం ఏపీ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "జగన్ చాలా చాలా దుర్మార్గుడు. జగన్‌కు తల్లి, చెల్లి, బాబాయ్ అందరూ ఒక్కటే. అధికారం కోసం ఏమైనా చేస్తాడు.

జగన్‌కు వ్యతిరేకం గా షర్మిల గట్టిగా మాట్లాడుతున్నారు. బాబాయిని చంపినట్లు షర్మిలను చంపుతారని నాకు అనుమానం ఉంది" అంటూ అయ్యన్న పాత్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. షర్మిలకు వెంటనే సెక్యూరిటీని పెంచాలన్నారు. సొంత బాబాయిని చంపేశారని, అందుకే తమకు జగన్ మీద అనుమానం ఉందన్నారు.

**జగన్‌పై షర్మిల ఎదురు దాడి...** కాగా... ఏపీసీసీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టాక షర్మిల తన మార్క్ చూపించడం మొదలుపెట్టారు. ముఖ్యంగా సొంత అన్న అని కూడా చూడకుండా జగన్‌పై ఫైర్ అవుతున్నారు. తన కుటుంబాన్ని చీల్చారంటూ జగన్ చేసిన వ్యాఖ్యలపైనా షర్మిల్ కౌంటర్ అటాక్ ఇచ్చారు. 'అసలు కుటుంబాన్ని చీల్చింది ఎవరు ను వ్వు కాదా'.. అంటూ జగన్‌పై మండిపడ్డారు. రోజురోజుకూ జగన్‌పై తన మాటల ప్రవాహాన్ని షర్మిల పెంచుకుంటూ పోతున్నారు. "జగన్ అసలు నా అన్నే కాదు" అంటూ ఫైర్ అయ్యారు కూడా. అయితే షర్మిలను టార్గెట్ చేస్తూ వైసీపీ నేతలు కూడా మూకుమ్మడిగా మాటల దాడికి దిగారు. దీంతో తనపై విమర్శలు గుప్పిస్తున్న వైసీపీ నేతలకు కూడా షర్మిల వార్నింగ్‌లు ఇస్తూ విరుచుకుపడుతున్నారు. ఈ క్రమంలో షర్మిల, వైసీపీ నేతల మాటల యుద్ధంతో ఏపీలో రాజకీయాలు హాట్ హాట్‌గా మారాయి.



## మహాత్ముడికి సీఎం జగన్ నివాళి

తాడేపల్లి: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవీ. సుబ్బారెడ్డి పాల్గొన్నారు. "సత్యం, అహింస తన ఆయుధాలుగా స్వతంత్ర పోరాటం చేసి, జాతిపితగా నిలిచారు మహాత్మా గాంధీ గారు. ఆయన కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని మన ప్రభుత్వంలో గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సాకారం చేశాం.

నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పిస్తున్నాను" అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.




## ఏపీలో మరింత దూకుడు పెంచిన కాంగ్రెస్

విజయవాడ: ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఏపీలో కాంగ్రెస్ మరింత దూకుడు పెంచింది. మంగళవారం ఉదయం విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో కాంగ్రెస్ మేనిఫెస్టో కమిటి సమావేశం ప్రారంభమైంది. కాంగ్రెస్ సీనియర్ నేత పల్లంరాజు అధ్యక్షతన 11 మంది సభ్యులతో కూడిన మేనిఫెస్టో కమిటి సమావేశమైంది.

అన్ని పార్టీల కంటే ముందుగా మేనిఫెస్టో ప్రకటించాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ భావిస్తున్నట్లు సమాచారం. ఏపీకి ప్రత్యేకహోదా, విభజన హామీలు, సీపీఎస్ రద్దు, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిపివేతతో పాటు పలు సంక్షేమ పథకాలను మేనిఫెస్టోలో పెట్టేలా కమిటీ సూచనలు చేయనుంది. ఇప్పటికే నిరుద్యోగులు, విద్యార్థులు, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నేతలు పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను కలిసి తమ సమస్యలను వివరిస్తూ మేనిఫెస్టోలో ఈ అంశాలను పెట్టాలని కోరుతున్నారు.

తెలంగాణ తరహాలో గ్యారంటీ కార్డు రూపొందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కమిటి నివేదకను షర్మిల పరిశీలించనున్నారు. మార్పులు చేర్పుల అనంతరం ఏఐసీసీకి మ్యానిఫెస్టో నివేదికను ఆమె అందజేయనున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపే మేనిఫెస్టో ఫైనల్ చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు.

## సీఎం క్యాంప్ కార్యాలయానికి క్యూ కట్టిన ఎమ్మెల్యేలు..



అమరావతి: తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో అసెంబ్లీ, లోక్‌సభ ఇన్‌చార్జుల మార్పులు, చేర్పులపై కసరత్తు కొనసాగుతోంది. ఇప్పటికే నాలుగు జాబితాలను విడుదల చేసిన సీఎం జగన్మోహన్‌రెడ్డి ఐదో జాబితాపై ఫోకస్ పెట్టారు. అయితే ఈ నాలుగు జాబితాల్లో పేరు రాని నేతలంతా సీఎం క్యాంపు కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నేడు సీఎం క్యాంపు కార్యాలయానికి మంత్రులు గుడివాడ అమరనాథ్, ఉషశ్రీ చరణ్, ఎంఎల్ఏ పొన్నాడ వెంకట సతీష్ కుమార్ వచ్చారు. ఏపీ ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృ ష్ణారెడ్డి సీఎం క్యాంపు కార్యాలయంలోనే ఉన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైసీపీ కసరత్తులు చేస్తోంది. సర్వేల ఆధారంగా అభ్యర్థులకు నియోజకవర్గాలను కేటాయిస్తోంది.

## జగన్ లక్కీ నంబర్ లక్ష: తెదేపా నేత ఆనం వెంకటరమణారెడ్డి

నెల్లూరు: సాక్షి టీవీ తనది కాదంటూ సీఎం జగన్నాటకాలు ఆడుతున్నారని తెదేపా అధికార ప్రతినిధి ఆనం వెంకట రమణారెడ్డి ఆరోపించారు. అసలు సాక్షి సంగతే తనకు తెలియదన్నట్లు మాట్లాడు తున్నారని విమర్శించారు. నెల్లూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ లక్కీ నంబర్ లక్ష అని చెప్పిన ఆనం.. రూ. లక్షతో ఆయన పెట్టిన కంపెనీలన్నీ వేల కోట్లకు చేరుకు న్నాయని ఆరోపించారు. జగతి పబ్లికేషన్స్ కూడా రూ. లక్ష పెట్టుబడితో పెట్టిందేనని తెలిపారు. ఇందులో రూ. 35వేలు విజయసాయిరెడ్డి, జె. జగన్‌మోహన్‌రెడ్డి రూ. 30 వేలు, కామత్ అనే మరో వ్యక్తి రూ. 35 వేలు పెట్టుబడి పెట్టారని చెప్పారు. తొలుత విజయసాయిరెడ్డి సాక్షిలో డైరెక్టర్‌గా ఉన్నారని ఆనం తెలిపారు. ఆయన రాజీనామా చేయగానే జగన్ డైరెక్టర్ అయ్యారని.. ప్రస్తుతం ఆయన సతీమణి భారతీరెడ్డి కొనసాగుతున్నారని చెప్పారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి కూడా ఆ సంస్థకు డైరెక్టర్‌గా పని చేశారన్నారు. వీళ్లంతా




డైరెక్టర్లుగా ఉంటే జగన్‌కు సంబంధం లేదా?అని ప్రశ్నించారు. "లక్ష రూపాయల కంపెనీలు రూ. వేల కోట్లుగా మారాయి. వైఎస్ కుటుంబం మొత్తానికి సాక్షిలో వాటాలు ఉన్నాయి. తనకేమీ సంబంధం లేనట్లు జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు" అని ఆనం మండిపడ్డారు.




## "సిద్ధం"... బెజవాడలో వైసీపీ - జనసేన ఫ్లెక్సీ వార్!

విజయవాడ : ఏపీలో ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార వైసీపీ "సిద్ధం" అంటూ సమర శంఖారావం పూర్తించిన సంగతి తెలిసిందే. ఈ నెల 27న భీమిలి నియోజకవర్గంలో జరిగిన ఈ భారీ బహిరంగ సభకు జనం ఏస్థాయిలో వచ్చారనేది తెలిసిన విషయమే. ఈ విషయంపై రాజకీయ ప్రత్యర్థులు సైతం కామెంట్ చేయడానికి వీలైనంత దూరాన్ని పాటించారన్నా అతిసయోక్తి కాదేమో! ఇదే సమయంలో చంద్రబాబు "రా.. కదలిరా" సభలూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నాయి. ఈ సమయంలో... "సిద్ధం" వర్సెస్ "రా.. కదలిరా" సభలకు వచ్చి న స్పందన, ఆదరణం, నేతలు చేసిన ప్రసంగాలు, ఇచ్చిన హామీలు, గతంలో చెప్పిన మాటలు, చేసిన పనులు మొదలైన విషయాలను భేరీజు వేసుకుంటూ ప్రజానికం ఒక క్లారిటీకి వస్తున్నారని అంటున్నారు. ఈ సమయంలో... త్వరలో జనసేన అధినేత పవన్ కూడా ఉత్తరాంధ్ర నుంచి ఎన్నికల శంఖారావం మొదలుపెట్టబోతున్నారని అంటున్నారు. దీనికి ఏప్రిల్ 4న ముహూర్తం అని కథనాలొస్తున్నాయి. ఆ సంగతి అలా ఉంటే... వైసీపీ చేపట్టిన "సిద్ధం" కార్యక్రమాలను ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... ప్రతీ సభకూ మినిమం మూడు లక్షల మంది హాజరయ్యేలా చూడాలని.. ఒక బలమైన సంకేతాన్ని సమాజంలోకి పంపాలని ప్రయత్నిస్తున్నారని అంటున్నారు. ఈ విషయంలో భీమిలిలో జరిగిన మొదటి "సిద్ధం" సభ భారీస్థాయిలో జరిగిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో వైసీపీ "సిద్ధం" అంటుంటే... జనసేన "మేము సిద్ధమే" అంటుంది. అవును... ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచార కార్యక్రమాన్ని మొదలుపెట్టిన వైసీపీ "సిద్ధం" అంటూ రీజనల్ మీటింగ్స్ కండక్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించిన ఫ్లెక్సీలు రాష్ట్ర వ్యాప్తంగా హల్ చల్ చేస్తున్నాయి. ఈ సమయంలో విజయవాడలో భారీ ఎత్తున ఈ ఫ్లెక్సీలు వెలిశాయి. దీంతో... వీటికి పక్కనే కౌంటర్ ఫ్లెక్సీలు వెలుస్తున్నాయి. ఈ మేరకు జనసేన నేతలు, కార్యకర్తలు ఈ ఫ్లెక్కీలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో... "మేము సిద్ధమే" అని రాసి ఉండటం గమనార్హం. ప్రస్తుతం విజయవాడలో ఉన్న "సిద్ధం" ఫ్లెక్సీ పక్కన పవన్ కల్యాణ్ ఫోటోలతో ఉన్న "మేము సిద్ధమే" అనే ఫ్లెక్సీ దర్శనమిస్తున్నాయి. వీటిని రాష్ట్ర వ్యాప్తంగా ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. ఈ ఫ్లెక్సీలలో పవన్ కల్యాణ్ ఫోటోతో పాటు వంగవీటి మోహన్ రంగ ఫోటోలను కూడా ప్రింట్ చేయడం గమనార్హం!! కాగా... జనసేన ఎన్నికల ప్రచారం ఉత్తరాంధ్ర నుంచి మొదలు పెట్టాలని పవన్ భావిస్తున్నారని ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... తొలిసభను ఫిబ్రవరి 4న అనకాపల్లిలో ప్లాన్ చేశారని తెలుస్తుంది. అదే విధంగా ఉత్తరాంధ్ర సభ తర్వాత డా. బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురంలో రెండో సభ, మచిలీపట్నంలో మూడో సభ, నాదెండ్ల మనోహర్ పోటీ చేస్తారని చెబుతున్న తెనాలిలో నాలుగోసభ, తిరుపతిలో ఐదోసభ ఉంటుందని అంటున్నారు.




అలప్పుళ: కేరళలో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన భాజపా నాయకుడి హత్య కేసులో అలప్పుళ కోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా తేలిన 15 మందికి మరణశిక్ష విధించింది. వీరంతా నిషేధిత పీఎఫ్ఐ సంస్థకు చెందిన వ్యక్తులు కావడం గమనార్హం. ఒక కేసులో ఇంత ఎక్కువ మందికి మరణశిక్ష విధించడం కేరళ చరిత్రలోనే ఇదే తొలిసారి. నిందితుల్లో 8 మందిపై హత్య అభియోగాలు, మిగతా వారిపై కుట్ర ఆరోపణలు రుజువైనట్లు కోర్టు తెలిపింది. వీరంతా శిక్షణ పొందిన కిల్లర్ స్క్వాడ్ అని, భాజపా నేతను ఆయన కుటుంబం కళ్లముందే అతి దారుణంగా చంపేశారని ప్రాసిక్యూషన్ పేర్కొంది. అత్యంత క్రూరమైన నేరంగా దీన్ని పరిగణించి దోషులకు గరిష్ఠ శిక్ష విధించాలని న్యాయస్థానాన్ని కోరింది. వాదనలు విన్న ధర్మాసనం.. దోషులకు మరణశిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. 2021 డిసెంబరు 19న అలప్పుళలో భాజపా ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి రంజిత్ శ్రీనివాసన్‌ను హత్య చేశారు. పీఎఫ్ఐ, ఎస్‌డీపీఐ కార్యకర్తలు అతని ఇంట్లోకి చొరబడి చంపేశారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొందర్ని అరెస్టు చేశారు. దీనిపై విచారణ జరిపిన అదనపు సెషన్స్ కోర్టు.. ఈ కేసులో 15 మందిని దోషులుగా నిర్ధారించింది.

ఆ ఏడాది డిసెంబరు 18న సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) నాయకుడు కేఎస్ షాన్ ఇంటికి తిరిగి వస్తుండగా ఒక ముఠా చంపేసింది. ఈ ఘటన జరిగిన కొద్ది గంటలకే రంజిత్ హత్య జరగడం అప్పట్లో తీవ్ర కలకలం సృష్టించింది.




రాంచీ: భూకుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఝార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ అందుబాటులో లేకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా నేతృత్వంలోని సంకీర్ణ కూటమి ఎమ్మెల్యేలంతా రాంచీకి రావడంతో రాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. త్వరలో రాష్ట్ర నాయకత్వంలో మార్పు జరగొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. సోరెన్ సతీమణికి సీఎం పగ్గాలు అప్పగించే అవకాశాలున్నట్లు ప్రచారం జరుగుతోంది. సంకీర్ణ కూటమిలోని జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ ఎమ్మెల్యేలంతా లగేజీలతో సోమవారం రాంచీ చేరుకున్నారు. తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించేందుకు మంగళవారం మధ్యాహ్నం వీరంతా సీఎం నివాసంలో సమావేశం కానున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. కొన్ని రోజుల పాటు ఎమ్మెల్యేలంతా రాంచీలోనే ఉండా లని హైకమాండ్ నుంచి ఆదేశాలు అందినట్లు తెలిపాయి. ఈ పరిణామాలపై భాజపా ఎంపీ నిషికాంత్ దూబే స్పందిస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "హేమంత్ సోరెన్‌జీ తన ఎమ్మెల్యేలను రాంచీకి పిలిచారు. మాకు అందిన సమాచారం ప్రకారం.. హేమంత్ తన సతీమణి కల్పనా సోరెన్‌కు ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించే ప్రతిపాదనలు ఉన్నాయి. ఈడీ విచారణతో సీఎం భయపడుతున్నారు. తాను రోడ్డు మార్గంలో దిల్లీ నుంచి రాంచీకి వస్తానని తన పార్టీ నేతలకు సోరెన్ చెప్పినట్లు తెలిసింది" అని దూబే సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## గెలిచాక ప్యాలెస్‌కే జగన్ పరిమితం..



నెల్లూరు నగరంలో మాజీ మంత్రి నారాయణ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనం మయూర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి నారాయణ మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి గెలిచే వరకు పాదయాత్రలు చేశాడని... గెలిచాక ప్యాలెస్‌కే పరిమితమయ్యాడని విమర్శించారు.

నెల్లూరు: నెల్లూరు నగరంలో మాజీ మంత్రి నారాయణ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆనం మయూర్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి నారాయణ మాట్లాడుతూ.. జగన్మోహన్ రెడ్డి గెలిచే వరకు పాదయాత్రలు చేశాడని... గెలిచాక ప్యాలెస్‌కే పరిమితమయ్యాడని విమర్శించారు. ఎవరో ఇచ్చే సలహాలతో అరాచకపు పాలన సాగిస్తున్నాడంటూ నారాయణ దుయ్యబట్టారు. జగన్మోహన్ రెడ్డికి పరిపాలన అనుభవం లేక రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడన్నారు. ఎవరికి టిక్కెట్టు ఇచ్చినా టీడీపీ, జనసేన కలిసి పనిచేస్తాయన్నారు. సీట్ల కేటాయింపుని అధినేతలు నిర్ణయిస్తారన్నారు. పది రోజుల్లో అభ్యర్థులని టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటిస్తారని నారాయణ తెలిపారు.

## హీరోయిన్ బ్యూటీ ఫుల్ ప్రాక్టీస్.. మరో కప్ పక్కా!

కోలీవుడ్ నటి నివేదా పేతురాజ్.. తెలుగులోనూ మంచి క్రేజ్ సంపాదించుకుంది. మొదట్లో డబ్బింగ్ చిత్రాలతో టాలీవుడ్ ఆడియెన్స్ ను ఆకట్టుకున్న ఈ బ్యూటీ.. ఆ తర్వాత చిత్రలహరి, పాగల్, అల వైకుంఠపురములో సినిమాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అయితే ఈ భామకు సినిమాలే కాదు.. ఆటలన్నా కూడా ఇష్టమే. బ్యాడ్మింటన్ లో ఇటీవలే ఓ కప్పు కొట్టేసిన సంగతి తెలిసిందే. తమిళనాడులో రీసెంట్ గా జరిగిన రాష్ట్రస్థాయి బాడ్మింటన్ పోటీల్లో నివేదా పేతురాజ్ విజేతగా నిలిచింది. మధురైకు ప్రాతినిథ్యం వహిస్తున్న నివేద.. మిక్స్ డ్ డబుల్స్ ఫైనల్ లో ప్రత్యర్థి జంటపై గెలిచి ఛాంపియన్ గా నిలిచింది. బెస్ట్ కోచ్ అంటూ హ్యాష్ ట్యాగ్ తో సోషల్ మీడియాలో తన సంతోషాన్ని పంచుకుంది. ఇక వాట్ నెక్ట్స్? అంటూ అందరిలోనూ ఆసక్తిని పెంచింది. నెక్ట్స్ మరో ఈవెంట్ లో కప్పు కొడతానని ఇన్ డైరెక్ట్ గా చెప్పిందని ఫ్యాన్స్ చెప్పుకొచ్చారు. తాజాగా నివేదా పేతురాజ్ చేసిన పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. స్పోర్ట్స్ అవుట్ ఫిట్ వేసుకుని బ్యాడ్మింటన్ కోర్ట్ లో ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోను షేర్



చేసింది. బ్యాక్ టు ప్రాక్టీస్ అని అర్థం వచ్చేలా క్యాప్షన్ ఇచ్చింది. ఇక ఈ పిక్ కు వేలల్లో లైకులు వచ్చిపడుతున్నాయి. త్వరలోనే ఈ అమ్మడు మరో కప్ కొట్టడం పక్కా అని ఫ్యాన్స్ చెబుతున్నారు. గేమ్ ప్రాక్టీస్ చేస్తూనే చిరునవ్వుతో అదరగొట్టిందని అంటున్నారు. మరోవైపు, సోషల్ మీడియాలో వరుస ఫొటో షూట్స్ తో సందడి చేస్తుంటుందీ అమ్మడు. మోడ్రన్ ఔట్ ఫిట్స్ తోపాటు చీరల్లో అందాలు ఆరబోస్తుంటుంది. తన లుక్స్ తో కుర్రకారు మతులు పోగుడుతోంది. ఇటీవలే సంక్రాంతి స్పెషల్ గా ప్యారెట్ గ్రీన్ కలర్ శారీ, పింక్ బ్లౌజ్ తో దిగిన ఫొటోలను షేర్ చేసింది. అయితే నివేదా ఇప్పుడు అంతగా సినిమాల మీద ఫోకస్ పెడుతున్నట్టుగా కనిపించడం లేదు. శ్రీ విష్ణు మెంటల్ మదిలో సినిమాతో తెలుగు వాళ్లకు హీరోయిన్?గా పరిచయమైంది నివేద. ఈ మూవీ తర్వాత బ్రోచేవారెవరురా, చిత్రలహరి, అల వైకుంఠపురము లో సినిమాల్లో తళుక్కుమంది. రెడ్ మూవీలో పోలీస్‌గా అలరించింది. విరాటపర్వంలో కీలక పాత్ర పోషించిన గ్లామర్ బ్యూటీ.. విశ్వక్ సేన్ తో పాగల్, దాస్ కా ధమ్కీ సినిమాలతో ఆకట్టుకుంది. బ్లడీ మేరీ, బూ చిత్రాలతో ఓటీటీల్లో కూడా ఎంట్రీ ఇచ్చింది. అయితే నివేదతో స్పోర్ట్స్ డ్రామా ప్లాన్ చేయండని మేకర్స్ కు నెటిజన్లు సలహా ఇస్తున్నారు. మరి నివేదను ఆ జానర్ చిత్రాల్లో మేకర్స్ తీసుకుంటారో లేదో చూడాలి.

## డబుల్ ఇస్మార్ట్ ని చెక్కుతున్నాడా?

ఒకప్పుడు పూరి సినిమా ఇంటే ఇలా సెట్స్కి వెళ్లి షూటింగ్ సహా అన్ని పనులు పూర్తిచేసుకుని అలా రిలీజ్ అయ్యేది. టాలీవుడ్ లోనే అత్యంత వేగంగా సినిమా పూర్తి చేసి రిలీజ్ చేసే ఏకైక దర్శకుడిగా ఆయనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. అయితే ఈ కారణంగా పరాజయాలు కూడా ఎక్కువవు తున్నాయనే విమర్శ కూడా ఉంది. పూరి ఎక్కువ సమయం తీసుకుని తొందరపడకుండా సినిమా చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అభిమానులు సహా ఆయన సతీమణి కూడా అభ్యర్థించారు. ఇలా వాళ్ల అభ్యర్థన మేరకు..సక్సెస్ కోసం పూరి ఇప్పుడు రూట్ మార్చారు. అందుకే ఇస్మార్ట్ శంకర్ కి సీక్వెల్ గా తెరకెక్కిస్తోన్న డబుల్ ఇస్మార్ట్ శంకర్ ని ఇంత ఆలస్యం చేస్తున్నారన్నది వాస్తవం. లేదంటే పూరి శైలిలో చుట్టేసి రిలీజ్ చేయమంటే రామ్ ఎప్పుడో మార్కెట్ లోకి వచ్చేసాడు. కొన్ని నెలలుగా ఈ సినిమా పనుల్లో టీమ్ అంతా నిమగ్నమైన సంగతి తెలిసిందే. ఈ



సినిమా విషయంలో పూరి సహా అంతా ఆచితూచి అడుగులు వేస్తున్నారు. పూరి సొంత నిర్మాణం లోనూ రూపొందుతున్న సినిమా. ఎలాగైనా హిట్ అందుకుని అన్ని లెక్కలు సరి చేయాల్సిన సినిమా కూడా ఇదే . దీంతో పూరి కాన్సంట్రేషన్ అంతా ఈ సినిమాపైనే పెట్టి పనిచే స్తున్నాడు. అటు రామ్ కూడా రేసులో బాగా వెనుకబడ్డాడు. ఇస్మార్ట్ శంకర్ తర్వాత సరైన సక్సెస్ కూడా పడలేదు. దీంతో ఆయన కూడా కూల్ గానే చేద్దామనే భరోసా ఇవ్వడంతో పూరి అంతే కూల్ గా పూర్తి చేస్తున్నాడు. ఈ క్రమంలోనే సినిమాని సెట్స్ లో చెక్కుతున్నట్లు కనిపిస్తుంది. ఒకటికి రెండుసార్లు తానేం తీసారో చెక్ చేసుకుని ది బెస్ట్ అనుకున్న ఔట్ ఫుట్ నే తీసుకుని ముందుకెళ్తున్నట్లు కనిపిస్తుంది. ఏది ఏమైనా ఇలా టైమ్ తీసుకుని సినిమా చేయడం ఎంతో ఉత్తమమైనది. ఇప్పుడున్న పోటీలో నెట్టుకురావాలంటే? హీరోని కొత్తగానూ చూపించాలి. మరి రామ్ పాత్రని పూరి డబుల్ ఇస్మార్ట్ లో ఎంత కొత్తగా చూపిస్తాడో చూడాలి.




## ముగ్గురు మిత్రుల 'కిస్మత్'..




ఈమధ్య ఫ్రెండ్ షిప్ స్టోరీలు బాగా వర్కౌట్ అవుతున్నాయి. నలుగురు, ముగ్గురు ఫ్రెండ్స్.. వారి జీవితంలో జరిగిన సంఘటనల ఆధారంగా దర్శకులు కథలు అల్లి.. ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు మేకర్స్. కుర్రాళ్లు.. వారిలో తమను తాము చూసుకుంటూ సినిమాలను హిట్ చేసేస్తున్నారు. ఇటీవలే రిలీజ్ అయిన మ్యాడ్ సినిమా ఏ రేంజ్ లో హిట్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇప్పుడు అలాంటి మూవీనే మరొకటి రిలీజ్ కు సిద్ధమైంది.. అదే కిస్మత్. నరేశ్ అగస్త్య, అభినవ్ గోమఠం, విశ్వదేవ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో అవసరాల శ్రీనివాస్ కీలక పాత్రలో కనిపించనున్నారు. డైరెక్టర్ శ్రీనాథ్ బాదినేని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రియా సుమన్ హీరోయిన్ గా నటించారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్లు, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను ప్రముఖ నిర్మాత దిల్రాజు లాంఛ్ చేసి బెస్ట్ విషెస్ చెప్పారు. కిస్మత్ సినిమా ట్రైలర్ చాలా ఎంటర్టైనింగ్ గా ఉందని నెటిజన్లు చెబుతున్నారు. ముగ్గురి స్నేహితుల జర్నీని చాలా హిలేరియస్ గా దర్శకుడు ప్రజెంట్ చేశారని అంటున్నారు. ఉద్యోగ ప్రయత్నాల్లో ఈ ముగ్గురి 'కిస్మత్' సిటీకి వెళ్లిన తర్వాత ఎలా మారిందనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉందని కామెంట్లు పెడుతున్నారు. హీరోలకు రూ.10 లక్షలు దొరికాక 'డబ్బు సంపాదించడం ఎంత కష్టమో దాన్ని దాచుకోవడం అంత కంటే కష్టం' అంటూ అజయ్ ఘోష్ చెప్పిన డైలాగ్ ఇంట్రెస్టింగ్ గా ఉందని అంటున్నారు. ఆ తర్వాత వచ్చిన సన్నివేశాలు చాలా థ్రిల్లింగ్ గా ఉన్నాయని చెబుతున్నారు. నరేష్ అగస్త్య, విశ్వదేవ్, అభినవ్.. ఈ ముగ్గురి మధ్య కెమిస్ట్రీ చాలా నేచురల్ గా ఉంది. ముగ్గురూ మంచి పెర్ఫార్మెన్స్ తో ఆకట్టుకున్నారు. వండర్ ఫుల్ టైమింగ్ తో వారు చెప్పిన చిన్న చిన్న డైలాగ్స్ వినోదాన్ని పంచాయి. హీరోయిన్ రియా సుమన్ తన లుక్స్ తో ఆకట్టుకుంటోంది.

అందరినీ అలరించే కామెడీ ఎంటర్టైనర్ ను డైరెక్టర్ శ్రీనాథ్ అందించబోతున్నారని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. వేదరామన్ శంకరన్ అందించిన విజువల్స్, మార్క్ కె రాబిన్ నేపథ్య సంగీతం ట్రైలర్ కు మరింత ఆకర్షణగా నిలిచాయి. మొత్తానికి ట్రైలర్ కిస్మత్ మూవీపై క్యూరియాసిటీని పెంచింది. కామ్రేడ్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, అథీరా ప్రొడక్షన్స్ బ్యానర్లపై ప్రొడ్యూసర్ రాజు నిర్మిస్తున్న ఈ చిత్రానికి సీహెచ్ భానుప్రసాద్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీ ఫిబ్రవరి 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. మరి ఈ సినిమా ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

## టిల్లు స్క్వేర్ రిలీజ్ డేట్ - సిద్ధు థియేటర్లలోకి వచ్చేది ఎప్పుడంటే?




టాలీవుడ్ యంగ్ హీరో సిద్ధూ జొన్నలగడ్డ పేరు చెబితే చాలు.. అందరికీ టిల్లు క్యారెక్టరే గుర్తుకొస్తుంది. ఆ పాత్రలో ఆయన యాక్టింగ్ అంత ఇంపాక్ట్ చూపించింది. డీజే టిల్లు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు సిద్ధూ జొన్నలగడ్డ ఫుల్లుగా వినోదాన్ని పంచారు. టిల్లు అంటే సిద్ధు, సిద్ధు అంటేనే టిల్లు అనేంతలా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆ సినిమాకు సీక్వెల్ చేస్తున్న సంగతి తెలిసిందే. రిపబ్లిక్ డే కానుకగా ఈ మూవీ రిలీజ్ డేట్ ను ప్రకటించారు మేకర్స్. సిద్ధు- అనుపమ పరమేశ్వరన్ జంటగా నటిస్తున్న టిల్లు స్క్వేర్ షూటింగ్ 2022 ఆగస్టు చివర్లో ప్రారంభమైంది. దీంతో మొదట మార్చి 2023లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు. కానీ తర్వాత రిలీజ్ డేట్ ను నవంబర్ 2023కు మార్చారు. అయితే షూటింగ్ తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ పనులు బ్యాలెన్స్ ఉండటంతో ఈఏడాది ఫిబ్రవరి 9కి రిలీజ్ డేట్‌ను కన్ఫర్మ్ చేశారు. కానీ రవితేజ ఈగల్ సినిమా కారణంగా టిల్లు స్క్వేర్ మరోసారి వాయిదా పడింది. ఇప్పటికే మూడు సార్లు వాయిదా పడ్డ ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా మార్చి 29వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ తాజాగా ప్రకటించారు. నో క్యాప్షన్, ఓన్లీ యాక్షన్ అంటూ స్పెషల్ పోస్టర్ ను కూడా రిలీజ్ చేశారు. అందులో సిద్ధు, అనుపమ యమా స్టైలిష్ లుక్ లో అనుపమను ఎత్తుకొని రొమాంటిక్ మోడ్ లో ఉన్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. టిల్లు స్క్వేర్ తో మరోసారి టిల్లు పాత్రలో సిద్ధూ జొన్నలగడ్డ ప్రేక్షకులను అలరించనున్నారు. మొదటి పార్ట్ లో నేహా శెట్టి నటించగా.. ఇప్పుడీ సినిమా కోసం హీరోయిన్ గా మేకర్స్ అనుపమ పరమేశ్వరన్ ను తీసుకున్నారు. ఈ చిత్రానికి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తుండగా.. సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమా బ్యానర్లపై టిల్లు స్క్వేర్ సినిమా తెరకెక్కుతోంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన టిక్కెట్టే కొనకుండా సాంగ్ మ్యూజిక్ లవర్స్ ను ఎంతగానో ఆకట్టుకుంది. డీజే టిల్లు సినిమాలోని టిల్లన్న డీజే కొడితే... పాట కూడా సూపర్ హిట్ అయ్యింది. దానిని రామ్ మిరియాల స్వర పరచడంతో పాటు ఆలపించారు. ఇప్పుడు టిక్కెట్టే కొనకుండా పాటకు కూడా ఆయనే సంగీతం అందించి పాడారు. మరి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయం సాధిస్తుందో చూడాలి.

## క్యూట్ స్టైల్ లో అనసూయ హై గ్లామర్ జోష్

తెలుగు ప్రేక్షకుల మనసులో చెరగని స్థానం సంపాదించుకుంది యాంకర్ కమ్ యాక్ట్రెస్ అనసూయ. టీవీ నటిగా అదరగొట్టి.. సినిమాల్లో కూడా సత్తా చాటుతోంది. ఓవైపు, వెండితెరపై అలరిస్తూనే.. సోషల్ మీడియాలోనూ సందడి చేస్తోంది ఈ అమ్మడు. మోడ్రన్ అండ్ శారీ ఫొటో షూట్స్ షేర్ చేస్తూ కుర్రకారుకు మైకం తెప్పిస్తోంది. సోషల్ మీడియాలో తన సింగిల్ పిక్స్ తో పాటు ఫ్యామిలీ ఫొటోలను షేర్ చేస్తుంటుంది అనసూయ. ఈసారి తన భర్త సుశాంక్ తీసిన అన్ ఫిల్టర్ పిక్స్ ను షేర్ చేసింది. బీచ్ సమీపంలోని ఓ రిసార్ట్ రూమ్ విండో దగ్గర కాఫీ తాగుతున్నట్లు ఫొటోలను పోస్ట్ చేసింది. సంతోషకరమైన ఆలోచనలతో పాటు కాఫీతో తాను ఇన్స్పైర్ అయ్యానంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్



మీడియాలో వైరల్ గా మారాయి. ఈ ఫొటోల్లో అనసూయ చాలా గ్లామరస్ గా కనిపిస్తోంది. బ్లూ కలర్ నైట్ వేర్ లో అందాలు ఆరబోస్తోంది. కుర్రకారు మతులు పోగుడుతుంటోంది. చిరునవ్వుతో అట్రాక్ట్ చేస్తోంది. జబర్దస్త్ బ్యూటీ సో అవ్సమ్ అంటూ ఫ్యాన్స్ కొనియాడుతున్నారు. అనసూయ ఫొటోలకు లైకుల వర్షం కురిపిస్తున్నారు. కామెంట్ బాక్స్ నింపేస్తున్నారు. అప్పుడెప్పుడో 18 ఏళ్ల కింద వచ్చిన ఎన్టీఆర్ నాగ సినిమా సమయంలోనే స్క్రీన్ పై కనిపించింది అనసూయ. ఆ తర్వాత కొన్నేళ్లకు న్యూస్ ప్రజెంటర్ గా మారి జబర్దస్త్ యాంకర్ గా అందరికీ కనెక్ట్ అయింది. ఈ షోతో అనసూయకు సూపర్ పాపులారిటీ దక్కింది. మెల్లగా వెండితెర వైపు పయనం మొదలుపెట్టి టీవీ షోస్ కు గుడ్ బై చెప్పేసిందీ అనసూయ. ప్రస్తుతం అనసూయ చేతిలో అనేక సినిమాలున్నాయి. అల్లు అర్జున్ పుష్ప- 2 సినిమాలో నటిస్తోంది. దీంతో పాటు పలు లేడీ ఓరియెంటెడ్ సినిమాల్లో నటిస్తోంది. ఈ జబర్దస్త్ భామ కాల్ షీట్స్ కోసం దర్శకనిర్మాతలు క్యూ కడుతున్నారు. గతేడాది ఆమె నటించిన ఐదు సినిమాలు.. థియేటర్లలోకి వచ్చాయి. ఫ్లాష్ బ్యాక్ తో పాటు మరికొన్ని తమిళ సినిమాలకు అనసూయ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అలా ఈ బ్యూటీ వరుస సినిమాలతో బిజీ బిజీగా గడుపుతోంది.

## ఆలియా క్రేజ్ ముందు జాన్వీ నిలవలేదు

ఆర్.ఆర్.ఆర్ తర్వాత రామ్ చరణ్ పూర్తిగా శంకర్ దర్శకత్వంలోని గేమ్ ఛేంజర్‌పై దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాలో విభిన్న వేషధారణలు, వైవిధ్యమైన ఆహార్యంతో అలరించనున్నాడు. తన కెరీర్ బెస్ట్ పెర్ఫామెన్సెస్ ని అందించనున్నాడని టాక్ ఉంది. అక్టోబర్ లో గేమ్ ఛేంజర్ విడుదల కానుంది. ఇంతలోనే రామ్ చరణ్ తదుపరి సినిమా ప్రీప్రొడక్షన్, కాస్టింగ్ ఎంపికలు జరుగుతున్నాయి. తదుపరి బుచ్చిబాబుతో సినిమా కోసం చరణ్ సన్నాహకాల్లో ఉన్నారు. ఇది స్పోర్ట్స్ గ్రామీణ నేపథ్యంలో సాగే సినిమా. ఈ చిత్రంలో చరణ్ పాత్ర ఛాలెంజింగ్ గా ఉంటుందని సమాచారం. అతడికి కథానాయికగా ఎవరిని ఎంపిక చేయనున్నారు? అన్నది సస్పెన్స్ గా మారింది. ఇటీవల ఆలియా, జాన్వీ కపూర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఆ ఇద్దరిలో ఆలియాకే ఎక్కువగా ఛాన్స్ ఉందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆలియా ఇంతకుముందు చరణ్



సరసన ఆర్.ఆర్.ఆర్ లో సీతగా నటించి మెప్పించింది. ఇప్పటికే సౌత్ కి సుపరిచితురాలు. దానికి తోడు ఆలియాకు ఉన్న అసాధారణ ట్రాక్ రికార్డ్ ని మేకర్స్ పరిశీలిస్తున్నారు. ఆలియా సీనియారిటీకి కూడా ప్రాధాన్యత ఉంది. ఈ ట్యాలెంటెడ్ బ్యూటీ ఇమేజ్ ముందు జాన్వీ కపూర్ ను ఇంకా అప్ కమ్ నటిగానే పరిగణించాలి. అందువల్లనే ఇప్పుడు జాన్వీకంటే ఆలియాకే ఎక్కువ స్కోప్ ఉందని టాక్ వినిపిస్తోంది. ఆలియా చేరికతో తమ ప్రాజెక్టుకు పాన్ ఇండియా అప్పీల్ వస్తుందన్న భావన కూడా ఉంది. అందుకే చరణ్ -బుచ్చి బాబు సినిమాకి తొలి ఆప్షన్ ఆలియా భట్.. జాన్వీ కపూర్ కు సెకండ్ ప్రయారిటీ మాత్రమే ఉంటుందని తెలుస్తోంది. ఇటీవల బుచ్చిబాబు టీమ్ ఆలియాను సంప్రదించగా, అట్నుంచి పాజిటివ్ సైన్ ఉందని కూడా టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం వాసన్ బాలాతో జిగ్రా షూటింగ్‌లో బిజీగా ఉంది. ఇందులో ఆలియా ప్రధాన పాత్ర పోషిస్తుండగా, తన సొంత నిర్మాణ సంస్థ ఎటర్నల్ సన్‌షైన్ ప్రొడక్షన్ ఈ చిత్రానికి సహ నిర్మాణ సంస్థగా వ్యవహరిస్తోంది. భారీ అంచనాలున్న ఈ చిత్రం సెప్టెంబర్ 2024లో థియేటర్లలోకి రానుంది. ఆలియా తదుపరి సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో నటించనుంది.



# గవర్నర్ కోటా ఎమ్మెల్సీల ప్రమాణానికి తెలంగాణ హైకోర్టు బ్రేకులు

హైదరాబాద్ : గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకాలను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. యథాతథ స్థితినే కొనసాగించాలని చెబుతూ.. కొత్త సభ్యులతో ప్రమాణం చేయించొద్దని మంగళవారం తన ఆదేశాల్లో పేర్కొంది. దీంతో తదుపరి ఉత్తర్వులు వచ్చేదాకా ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్‌లు ప్రమాణం చేయడానికి వీల్లేదు!. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు ప్రొఫెసర్ కోదండరామ్, అమీర్ అలీఖాన్. వీళ్ల నియామకాన్ని సవాల్ చేస్తూ దాసోజు శ్రవణ్, సత్యనారాయణలు హైకోర్టును ఆశ్రయించారు. గతంలో తాము వేసిన పటిషన్ విచారణ తేలేంత వరకు పిటిషన్ విచారణ ఆపాలంటూ కోరారు వాళ్లు. అయితే కోర్టు వాళ్ల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంది. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేదాకా ప్రమాణం చేయించవద్దని చెబుతూ.. ఫిబ్రవరి 8వ తేదీకి తదుపరి విచారణ వాయిదా వేసింది. కొద్ది నెలల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గవర్నర్ కోటా ఎమ్మెల్సీలను ప్రకటించింది. గవర్నర్ కోటాలో దాసోజు శ్రవణ్, సత్యనారాయణ నామినేట్ చేస్తున్నట్లు బీఆర్ఎస్ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ ఇద్దరి పేర్లను గవర్నర్ కు పంపారు. అయితే గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వీరి పేర్లను ఆమోదించలేదు. ఇంతలోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది.

అయితే గవర్నర్ తమ పేరును ఆమోదించకపోవడంపై దాసోజు శ్రవణ్, సత్యనారాయణ రాష్ట్ర హైకోర్టుకు వెళ్లారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టికల్ 171 ప్రకారం తమను ఎమ్మెల్సీలుగా నామినేట్ చేసిందని.. దాన్ని తిరస్కరించే హక్కు గవర్నర్‌కి లేదని వారు పేర్కొన్నారు. వీరి పిటిషన్ పై రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉంది. ఈలోపే కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను కాంగ్రెస్ ప్రభుత్వం గవర్నర్ కోటాకు ప్రతిపాదించంగా.. అందుకు గవర్నర్ ఆమోదం తెలపడంతోనే రాజకీయ అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి.

# వంట అయినంక గరిటె తిప్పినట్లు.. కాంగ్రెస్ సర్కారుపై హరీశ్‌రావు సెటైర్లు..!

స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు అందించే కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమం 'వంట అయినంక గరిటె తిప్పినట్లు' ఉందంటూ మాజీ మంత్రి హరీశ్‌రావు సెటైర్లు వేశారు. ఉద్యోగ భర్తీ ప్రక్రియను బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేస్తే.. తమ ప్రభుత్వ ఘనతగా నియామక పత్రాల జారీ పేరుతో కాంగ్రెస్ సర్కారు హడావుడి చేస్తుండడం దౌర్భాగ్యమన్నారు. ఫిబ్రవరి ఒకటిన గ్రూప్-1 నోటిఫికేషన్ ఇస్తామని కాంగ్రెస్ ప్రచారం చేసిందని.. దాని నుంచి విద్యార్థుల దృష్టి మరల్చేందుకు ముందు రోజున స్టాఫ్ నర్సులకు నియామక పత్రాల జారీ కార్యక్రమాన్ని హంగు ఆర్భాటంతో నిర్వహిస్తుందన్నారు. చేయని పనులకు డబ్బా కొట్టుకోవడం బదులు.. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలుపై శ్రద్ధ చూపాలని హరీశ్‌రావు హితవు పలికారు.

**బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనతే..** తెలంగాణ వైద్యారోగ్య రంగాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానానికి చేర్చే లక్ష్యంలో భాగంగా పెద్ద సంఖ్యలో ఆసుపత్రుల నిర్మాణంతో పాటు జిల్లాకో మెడికల్ కాలేజీ బీఆర్ఎస్ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఈ క్రమంలో వైద్య సిబ్బంది కొరత లేకుండా ఉండేందుకు మెడికల్, నర్సింగ్, పారామెడికల్, ఫార్మాసిస్టు, ఇతర సిబ్బంది రిక్రూట్మెంట్‌కు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇందులో భాగంగా 5,204 స్టాఫ్ నర్స్‌పోస్టులకు 2022 డిసెంబర్ 30న నోటిఫికేషన్ విడుదల చేయగా.. 2023 జూన్ 22న 1,890 పోస్టులను కలుపుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. దీంతో మొత్తం పోస్టుల సంఖ్య 7,094కు పెరిగిందని తెలిపారు. 2023 ఆగస్టు 2న ఉద్యోగాలకు పరీక్ష నిర్వహించి, తుది ఫలితాలు విడుదల చేసే సమయానికి ఎన్నికల కోడ్ మొదలైందన్నారు. దాంతో తుది ఫలితాల విడుదలకు తాత్కాలిక ఆటంకం కలిగిందని గుర్తు చేశారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రస్థాయి కార్యక్రమం నిర్వహిస్తూ, నియామక పత్రాలు ఇచ్చే పేరిట హడావుడి చేస్తూ స్టాఫ్ నర్సు నోటిఫికేషన్ తమ ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకుంటున్నదని విమర్శించారు.

**ఉద్యోగ నోటిఫికేషన్లు ఏమయ్యాయి? :** కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ ఏడాది 2లక్షల పోస్టులను భర్తీ చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. మొదటి కేబినెట్ సమావేశంలోనే ఆమోదించి, అభ్యర్థులకు ఎలాంటి అప్లికేషన్ ఫీజు లేకుండా, ఏడాదిలోపే అన్ని ఉద్యోగాలను భర్తీ చేస్తామని, అలాగే గతంలో ప్రారంభించిన నియామకాల ప్రక్రియను వాటి షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తామని కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్ పేరిట పత్రికల్లో ప్రకటనలు విడుదల



చేసిందని గుర్తు చేశారు. చెప్పినట్లుగా ఫిబ్రవరి ఒకటో తేదీన గ్రూప్-1 నోటిఫికేషన్, అలాగే ఏప్రిల్ 1న గ్రూప్-2, జూన్ 1న గ్రూప్-3,4 నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మార్చి 1న పోలీసు సహా తరహా యూనిఫాం పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ హామీలను నమ్మి ఎదురుచూస్తున్న ఉద్యోగ అభ్యర్థులకు, విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

**నర్సింగ్ ఆఫీసర్లకు శుభాకాంక్షలు.. :** స్టాఫ్ నర్సులుగా ఎంపికై బుధవారం నియామక పత్రాలు అందుకోబోతున్న అభ్యర్థులకు హరీశ్ రావు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మన్ననలు పొందేలా అత్యుత్తమ సేవలందించి, ఉద్యోగంలో రాణించాలని ఆకాంక్షించారు. మొత్తం 7,094 స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్మెంట్ బోర్డుని అభినందించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నర్సుల సేవలను గుర్తించి, వారి గౌరవాన్ని మరింత పెంచేలా వృత్తి పేరును ఉన్నతీకరించిందని హరీశ్‌రావు అన్నారు.

స్టాఫ్ నర్సని నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్సని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, హెడ్ నర్సని సీనియర్ నర్సింగ్ ఆఫీసర్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-2ను డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా, నర్సింగ్ సూపరింటెండెంట్ గ్రేడ్-1ను చీఫ్ నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని గుర్తు చేశారు. నర్సు పోస్టుల పేరును మా ప్రభుత్వం ప్రత్యేకంగా జీవో విడుదల చేసి ఉన్నతీకరించినప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా స్టాఫ్ నర్సులుగా పరిగణించడం శోచనీయమని హరీశ్‌రావు అన్నారు.

# 'కేటీఆర్.. ముందు మీ అయ్యతో ఆ మాట చెప్పించు'



హైదరాబాద్, జనవరి 30: మాజీ మంత్రి కేటీఆర్ మైనార్టీలపై దొంగ ప్రేమ ఒలకబోస్తున్నారని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ దుయ్యబట్టారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. "మీరు అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు ఏం చేశారు? కామారెడ్డికి వచ్చి మీ అయ్య ఎందుకు పోటీ చేసిండు? ఒక్క అమాయకుణ్ణి ఓడగొట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసింద్రు" అంటూ విరుచుకుపడ్డారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీలకు చేసిందేమి లేదన్నారు. తనకు కాంగ్రెస్ సర్కార్ సలహాదారులుగా నియమించిందన్నారు. ఎన్నికల్లో నిలబడ్డ మైనార్టీ నేతలు ఓడిపోయారని.. ఏం చేద్దాం మరి అని ప్రశ్నించారు. మైనార్టీలకు కాంగ్రెస్ అవకాశాలు ఇస్తుందన్నారు. ఇప్పటి వరకు వేసిన టీఎస్పీఎస్సీలో కావచ్చు, సుప్రీం కోర్టులో ఏజీగా మైనార్టీకి అవకాశం ఇచ్చిందన్నారు. రానున్న రోజుల్లో కూడా మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తదని స్పష్టం చేశారు. "ముందు మీ అయ్యతో కామారెడ్డికి వచ్చి ఎందుకు పోటీ చేశాడో చెప్పించు" అంటూ కేటీఆర్‌పై షబ్బీర్ అలీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

# బీఆర్ఎస్ హయాంలో వికారాబాద్ రాడార్ సెంటర్ నిర్మాణం: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్: దేశ రక్షణలో భాగంగా వికారాబాద్ రాడార్ సెంటర్ నిర్మాణం జరిగిందని తెలంగాణ మంత్రి కొండా సురేఖ స్పష్టంచేశారు. దేశంలో రెండో కేంద్రంగా వికారాబాద్ ఉందన్నారు. ఇలాంటి కేంద్రాలు తమిళ్ నాడులో ఉన్నాయని, ఎలాంటి ప్రమాదం జరగలేదని స్పష్టంచేశారు. వికారాబాద్‌లో రాడార్ సెంటర్ నిర్మాణం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని గుర్తుచేశారు. రాడార్ సెంటర్ కోసం 2010లో ఒప్పందాలు జరిగాయని కొండా సురేఖ వివరించారు. 2014లో భూముల బదలాయింపు, స్టేజ్ వన్ ఒప్పందాలు జరిగాయని పేర్కొన్నారు. 2017లో ధరల పెంపు, స్థలం మార్పు జరిగాయని వివరించారు. ఆ సమయంలోనే రూ.102 కోట్ల నిధులు విడుదల చేశారని వివరించారు. 2017 నవంబర్ 14న స్టేజ్-2 ఒప్పందాలు జరిగిందని, ఆ ఏడాదిలో జీవోను అప్పటి ప్రభుత్వం విడుదల చేసిందని పేర్కొన్నారు. రాడార్ సెంటర్‌కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. కొందరు కావాలని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు నష్టం జరిగే ప్రాజెక్టు కాదు కాబట్టే పరిశీలన చేసి తుది జీవో విడుదల చేశామని కొండా సురేఖ తేల్చిచెప్పారు. జంతువులు, మనుషుల ప్రాణాలకు ముప్పు లేదని స్పష్టంచేశారు. రాడార్ ప్రాజెక్టు వల్ల ప్రకృతికి నష్టం జరగదని, గ్రామాలు ఖాళీ చేయాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వానికి చెందిన పాఠశాలలు, కొత్త ప్రాజెక్టులు వస్తాయని వివరించారు. పరిరక్షణ కమిటీ, గ్రామాల నుంచి ప్రజలను తమిళనాడు పర్యటనకు తీసుకెళ్తామని స్పష్టంచేశారు. రెండు, మూడు నెలల్లో రాడార్ సెంటర్‌కు శంకుస్థాపన జరుగుతుందని వివరించారు. నాలుగు ఏళ్లలో నిర్మాణం పూర్తి అవుతుందని వెల్లడించారు.



# 2024: ఈసారి బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వే ఉంటుందా?

గత సంవత్సర కాలంలో దేశ ఆర్థిక పనితీరును.. రాబోయే సంవత్సరంలో ఆర్థికంగా ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి చెప్పేదే ఎకనమిక్ సర్వే. దేశ ఆర్థిక వ్యవస్థకు దిశానిర్దేశం చేసేదిగా భావించే ఈ సర్వే ఆధారంగానే పలు బడ్జెట్ రూపకల్పన జరుగుతుంది.

ఆర్థిక మంత్రిత్వశాఖ రూపొందించే ఈ సర్వే.. రానున్న రోజుల్లో దేశం ముందున్న సవాళ్లు, వాటిని ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన చర్యలను ముందుగానే అంచనా వేసి పలు సూచనలు చేస్తుంది. సాధారణంగా కేంద్ర ముఖ్య ఆర్థిక సలహాదారు ఆధ్వర్యంలో ఈ నివేదిక రూపొందిస్తారు.

**సర్వేలో ఏముంటుంది..?** బడ్జెట్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించే ఎకనమిక్ సర్వే.. దేశ ఆర్థిక వ్యవస్థ ఎలా ఉందన్న విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తుంది. కేవలం దేశ ఆర్థిక పరిస్థితులను తెలియజేయడమే కాకుండా ప్రధాన రంగాలైన వ్యవసాయం, పారిశ్రామికోత్పత్తి, మౌలిక సదుపాయాలు, ఎగుమతి దిగుమతులు, విదేశీ మారక నిల్వలు, నగదు చలామణి, ఉద్యోగాలు, ధరల పెరుగుదల వంటి అంశాలను కూడా వివరిస్తుంది. ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల స్థితిగతులు, ప్రభుత్వ విధాన నిర్ణయాలు, వాటివల్ల వస్తున్న ఫలితాలను విశ్లేషిస్తుంది. వచ్చే ఏడాది ఎదురయ్యే ఆర్థిక సవాళ్లు, వాటిని ఎదుర్కొనే వ్యూహాలను కూడా సూచిస్తుంది. కాబట్టి దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంటుంది.

**బడ్జెట్‌కు దీనికి తేడా ఏంటి?** కేంద్ర బడ్జెట్‌లో వివిధ రంగాల్లో రాబడి, ఖర్చుల కేటాయింపులను మాత్రమే పేర్కొంటారు. కానీ ఆర్థిక సర్వేలో మాత్రం ప్రస్తుత సంవత్సరం దేశ ఆర్థిక వ్యవస్థ పనితీరు విశ్లేషణ, రాబోయే రోజుల్లో ఎదురయ్యే సవాళ్లు, చేపట్టాల్సిన సంస్కరణలను ప్రముఖంగా ప్రస్తావిస్తారు. అందుకే ఈ ఆర్థిక సర్వే ఆధారంగానే కేంద్ర బడ్జెట్‌ను రూపొందిస్తారు.

**తొలిసారి ఎప్పుడు..?** బడ్జెట్ కన్నా ముందు ఆర్థిక సర్వేను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ఎన్నో ఏళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. మొట్టమొదటిసారిగా ఈ ఆర్థిక సర్వేను 1950-51 ఆర్థిక సంవత్సరంలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. 1964 వరకు సాధారణ బడ్జెట్‌తోనే కలిపి ప్రవేశపెట్టేవారు. 1964 నుంచి దీన్ని బడ్జెట్ కన్నా ముందు ప్రత్యేకంగా ప్రవేశపెడుతున్నారు. కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపుల ప్రతిపాదనలను తేలికగా అర్థం చేసుకోవడం కోసమే ఆర్థిక సర్వేను ప్రత్యేకంగా విడుదల చేస్తున్నారు.

**ఈసారి మాటేంటి?** పార్లమెంట్ సంప్రదాయం ప్రకారం.. ఎన్నికల ఏడాది తాత్కాలిక బడ్జెట్‌కు ముందు ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టరు. ఎన్నికల అనంతరం అధికారం చేపట్టే ప్రభుత్వమే.. సభలో ఆర్థిక సర్వేను ప్రవేశపెడుతుంది. జూన్- జులై నెలల్లో మిగిలిన ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌నూ పార్లమెంట్‌కు సమర్పిస్తుంది. అయితే, ఈ సారి ఆర్థిక సర్వే తరహాలో దేశ ఆర్థిక వ్యవస్థను ప్రతిబింబించే సంక్షిప్త నివేదికను కేంద్రం విడుదల చేసే అవకాశం ఉంది. జీడీపీ వృద్ధి, జీడీపీ అంచనాలు, చమురు ధరలు వంటి అంశాలను ఇందులో ప్రస్తావించే అవకాశం ఉంది.

# ఏసీబీ కస్టడికి శివ బాలకృష్ణ..నాంపల్లి ఏసీబీ కోర్టు అనుమతి

హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండిఏ మాజీ డైరెక్టర్ శివ బాలకృష్ణను 8 రోజుల కస్టడీకి ఏసీబీకి అనుమతి ఇస్తూ మంగళవారం నాంపల్లి ఏసీబీ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎనిమిది రోజుల పాటు బాలకృష్ణను ఏసీబీ అధికారులు విచారించనున్నారు. విచారణ సందర్భంగా బ్యాంక్ లాకర్లు ఓపెన్ చేయనున్నారు. శివ బాలక్రిష్ణ మోసాలపై ఏసీబీ అధికారులు విచారణ చేయనున్నారు. శివ బాలకృష్ణ పని చేసిన సమయంలో ప్రాజెక్ట్ ఫైల్స్ అన్ని పరిశీలించాలని ఏసీబీ నిర్ణయించింది. ఈ మేరకు హెచ్ఎండిఏ నుంచి ఫైల్స్‌ను తెప్పించుకుని విచారణ చేయనున్నారు. 10 రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై మంగళవారం విచారణ జరిపిన నాంపల్లి ఏసీబీ కోర్టు 8 రోజుల కస్టడీకి అనుమతిచ్చింది. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై అధికారులు విచారణ వేగవంతం చేయనున్నారు. పుప్పాల గూడలో రూ. వేయి కోట్ల ప్రాజెక్టు అనుమతులపై అవకతవకలు జరిగాయని.. దానికి సంబంధించిన ఫైల్స్ హెచ్ఎండిఏ ఇవ్వాలని కోరుతూ సంబంధిత అధికారులకు ఏసీబీ లేఖ రాసింది. కాగా అవినీతి నిరోధక శాఖ వలకు అతిపెద్ద తిమింగలం చిక్కింది! హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్.. ప్రస్తుత రెరా సెక్రటరీ శివబాలకృష్ణ, ఆయన బంధువుల ఇళ్లు, కార్యాలయాలలో ఏసీబీ ఆధికారులు ఐదు రోజుల క్రితం సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణల నేపథ్యంలో.. ఎనిమిది బృందాలుగా విడిపోయిన ఏసీబీ అధికారులు బుధవారం (24వ తేదీ) తెల్లవారుజామున 5 గంటల నుంచే




రాష్ట్రవ్యాప్తంగా 17 చోట్ల సోదాలు చేశారు. మణికొండలోని ఆయన నివాస గృహంలో, అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయంలో కూడా తనిఖీలు చేశారు. 2018-2023 కాలంలో హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలో కీలక స్థానంలో పనిచేసిన శివబాలకృష్ణ.. అధికార దుర్వినియోగానికి పాల్పడడం ద్వారా కోట్లాది రూపాయల ఆస్తులు అక్రమంగా కూడబెట్టినట్టు వచ్చిన ఆరోపణలు, వాటిపై తాజా ఫిర్యాదుల నేపథ్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. ఏసీబీ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో మణికొండలోని ఆయన ఇంటిలో సోదాలు నిర్వహించి, పదికి పైగా ఐఫోన్లు.. అత్యంత ఖరీదైన 50 వాచీలు.. కట్టలు కట్టలుగా నగదు.. ఆయన బీరువాలో 5 కిలోల బంగారు నగలు, 70 ఎకరాలకు సంబంధించిన భూముల పత్రాలు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే.

# జ్యోతిబాపూలే విగ్రహం పెట్టాలని ఇప్పుడు గుర్తొచ్చిందా?.. కవితపై మంత్రి శ్రీధర్ ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్, జనవరి 30: తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో మహనీయులు జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై ఇటీవల స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కలిసి కవిత వినతిపత్రం కూడా అందజేశారు. అయితే కవిత ప్రతిపాదనపై కాంగ్రెస్ నేతలు ధ్వజమెత్తుతున్నారు. జ్యోతిరావు పూలే విగ్రహం పెట్టాలని ఇప్పుడు గుర్తొచ్చిందా?.. పదేళ్లు మీ ప్రభుత్వంలో ఉండి ఏం చేశారంటూ హస్తం నేతలు మండిపడుతున్నారు. తాజాగా ఇదే అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. కవితపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీలో జ్యోతిబాపూలే విగ్రహం ఏర్పాటు విషయం 10 ఏళ్ల వాళ్ల ప్రభుత్వంలో కవితకు ఎందుకు గుర్తుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుడు ఎవరు అడ్డుకున్నారో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. అప్పటి సీఎం అడ్డుకున్నారా లేక స్పీకర్ అడ్డుకున్నారా అనేది స్పష్టం చేయాలన్నారు. జ్యోతిబాపూలే జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించిందే కాంగ్రెస్ అని చెప్పుకొచ్చారు. మహనీయులను స్మరించుకోవడంలో కాంగ్రెస్‌కు ఎవరూ ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయనే ఆలోచనతో రాజకీయంగా లబ్ధి పొందేందుకే జ్యోతిబాపూలే అంశం తెరపైకి తీసుకువచ్చారని మండిపడ్డారు. అసెంబ్లీ పరిసరాలు పూర్తిగా స్పీకర్, మండలి చైర్మన్ అధీనంలోనే ఉంటాయన్నారు. మండలి చైర్మన్ వారి పార్టీ మనిషే కదా అని అన్నారు. గవర్నర్ తీసుకునే నిర్ణయాలను వక్రభాష్యం పలకడం కేటీఆర్‌కు సమంజసం కాదన్నారు. ఎమ్మెల్సీల అంశం కోర్టులో కేసు నడుస్తోందని తెలిపారు. న్యాయస్థానానికి కూడా వక్ర భాష్యం పలుకుతారా అని నిలదీశారు. అసెంబ్లీ సమావేశాలు ఎప్పుడు అనేది కేబినెట్‌లో చర్చించి ప్రకటిస్తామని మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు.

# ఏబీవీపీ కార్యకర్తను జుట్టుపట్టి ఈడ్చుకెళ్లిన ఘటన.. కానిస్టేబుల్ సస్పెండ్

హైదరాబాద్: రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్ళిన ఘటనపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ ఘటనకు బాధ్యురాలైన మహిళా కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేసింది. ఏబీవీపీ కార్యకర్తపై అమనుషంగా ప్రవర్తించిన కానిస్టేబుల్ ఫాతిమాను సస్పెండ్ చేస్తూ సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

**అసలేం జరిగిందంటే..** హైదరాబాద్ శివార్లలోని రాజేంద్రనగర్‌లో ఉన్న జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన 100 ఎకరాల భూమిని రాష్ట్ర సర్కారు కొత్త హైకోర్టు నిర్మాణం కోసం కేటాయించిన విషయం తెలిసిందే. దీనిని నిరసిస్తూ ఏబీవీపీ కొన్నిరోజులుగా వ్యవసాయ వర్సిటీ వద్ద ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. హైకోర్టుకు భూకేటాయింపు జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో జనవరి 23న వర్సిటీలోని ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వద్ద చేపట్టిన ఆందోళనకు ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఝాన్సీ హాజరయ్యారు. ఆందోళన విషయం తెలిసిన రాజేంద్రనగర్ పోలీసులు అక్కడికి చేరుకుని, నిరసన తెలుపుతున్నవారిని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఝాన్సీ పోలీసుల నుంచి తప్పించుకుని ముందుకు పరుగెత్తారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు.. ఝాన్సీ జుట్టుపట్టుకుని లాక్కెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో ఆమె కిందపడిపోయింది. చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు ఝాన్సీతోపాటు 15మంది ఏబీవీపీ నాయకులను అదుపులోకి తీసుకొని రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్సీ) కూడా స్పందించింది. మీడియా కథనాలను సుమోటోగా స్వీకరించి.. ఘటనపై వివరణ కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. యువతి ఆరోగ్య పరిస్థితి సహా పూర్తి వివరాలతో నాలుగు వారాల్లోగా నివేదిక అందించాలని సీఎస్, డీజీపీకి నోటీసులు ఇచ్చింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com